FOR ADS.......
ఆకాంక్ష
CONTACT:
8333818121

# తొలి ఆకాంక్ష
తెలుగు సంచలన దిన పత్రిక TGTEL/25/A1964

విలేకరులు కావలెను
ప్రజా సమస్యల పరిష్కార మార్గాలనే లక్ష్యంగా ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న తొలి ఆకాంక్ష దినపత్రికలో భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, జగిత్యాల, జనగాం, మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం, ఆదిలాబాద్, కామారెడ్డి, యాదాద్రి మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, జోగులాంబ గద్వాల్ , సూర్యాపేట, జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్‌తో పాటు ...
అన్ని జిల్లాలోని నియోజక వర్గ కేంద్రాలకు విలేకరులు కావలెను ..
సంప్రదించండి...
8333818121
ఎడిటర్ పెనగొండ సతీష్
తొలి ఆకాంక్ష akankshanews.com TGTEL/25/A1964 తెలుగు సంచలన దిన పత్రిక

ప్రచురణ : తెలంగాణ   సంపుటి : 01   సంచిక :200   ఎడిటర్ : పెనగొండ సతీష్   పేజిలు : 08,   వెల. 5రూ/   గురువారం- 12 - మార్చి - 2026

## జగన్ చిట్టా కేంద్ర ప్రభుత్వం వద్ద ఉంది



**జగన్ హయాంలో రాష్ట్రం దివాలా తీసిందన్న అప్పలనాయుడు**

**వింత పాలసీలతో ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేశారని మండిపాటు**

**జగన్ ప్రభుత్వం మహిళల మాంగల్యాలను తెంపిందని వ్యాఖ్య**

అమరావతి : కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థికంగా నాశనం చేసిందంటూ వైసీపీ అధినేత జగన్ చేసిన వ్యాఖ్యలపై ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఘాటుగా స్పందించారు. జగన్ హయాంలో రాష్ట్రం దివాలా తీసిందని, ఇప్పుడు ఆయన ఆర్థిక వ్యవస్థ గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని మండిపడ్డారు. "జగన్ హయాంలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారు. చివరకు మున్సిపల్ కార్యాలయాలను కూడా తాకట్టు పెట్టారు. దేశంలో ఎక్కడా లేని వింత పాలసీలతో ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేశారు" అని కలిశెట్టి ఆరోపించారు. మిగతా..2లో

## సంక్షోభం వేళ, గ్యాస్ బుకింగ్ పేరుతో సైబర్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండండి




**'ఎక్స్' వేదికగా హెచ్చరించిన హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్**

**గ్యాస్ కొరత ఉందన్న ఆందోళనను సైబర్ కేటుగాళ్లు అనుకూలంగా మార్చుకుంటున్నారన్న సజ్జనార్**

**తక్షణమే సిలిండర్ డెలివరీ చేస్తామంటూ నకిలీ ప్రకటనలు వస్తున్నాయని హెచ్చరిక**

హైదరాబాద్ : గ్యాస్ బుకింగ్ పేరుతో మోసాలు చేసేవారి పట్ల జాగ్రత్తగా ఉండాలని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ హెచ్చరించారు. మిగతా..2లో

## దానం, కడియంలకు క్లీన్ చిట్ ఇవ్వడంపై కేటీఆర్ ఫైర్



★ఇది ప్రజాస్వామ్యంపై బహిరంగ దాడి అన్న కేటీఆర్

★కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీగా పోటీ చేసిన వ్యక్తికి క్లీన్ చిట్ ఇచ్చారని మండిపాటు

★ప్రజాస్వామ్య విలువలు ఎక్కడున్నాయని ప్రశ్న

### వెలుగుమట్ల బాధితులకు ఇళ్ల పట్టాల పంపిణీ

## 'భూదాన్ భూములు ఎప్పటికైనా పేదలవే'

▶▶వెలుగుమట్ల బాధితుల్లో 311 మంది మహిళలకు ఇళ్ల స్థలాలు, ఇంటి పట్టాలు ఇచ్చిన మంత్రులు

▶▶సెంబర్ 9లోపు 311 మందికి ఇళ్లు పూర్తి చేసి గృహప్రవేశం చేయిస్తామని హామీ

▶▶ఇళ్ల పట్టాలు, ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాలు ఇస్తున్న మంత్రులు



హైదరాబాద్: ఖమ్మం పట్టణంలో వెలుగుమట్ల బాధితులకు ఇళ్ల పట్టాలతో పాటు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఇచ్చారు. ఈ కార్యక్రమంతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి, తుమ్మల నాగేశ్వరరావులు పాల్గొన్నారు. 311 మంది మహిళలకు ఇళ్ల స్థలాలు, ఇంటిపట్టాలు ఇచ్చామని అధికారులు తెలిపారు. నిరాశ్రయులకు ఇందిరమ్మ ఇళ్లు కూడా కేటాయిస్తున్నట్లు తెలిపారు. వెలుగుమట్లలో 1953 నుంచి 31 ఎకరాల భూమి భూదాన్ భూమిగా ఉందని, వెంకట రాజారాం అనే రైతు భూదాన్ ట్రస్టుకు 31.1 ఎకరాలు రాసిచ్చినట్లు పేర్కొన్నారు. పక్కన ఉన్న మిగతా భూమి అంతా పట్టా భూములుగా ఉందని స్పష్టం చేశారు.

## ఫిరాయింపులపై కేటీఆర్ మాట్లాడటం విడ్డూరం

ఫిరాయింపులపై మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కేటీఆర్..

'బీఆర్ఎస్ తీసుకుంటే అభివృద్ధి కోసం.. కాంగ్రెస్ తీసుకుంటే ప్రజాస్వామ్యంపై దాడా' అంటూ మంత్రి మండిపడ్డారు.



హైదరాబాద్, మార్చి 11: బీఆర్ఎస్ నుంచి ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లను కొట్టివేస్తూ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇచ్చిన తీర్పుపై మంత్రి సీతక్క స్పందించారు.

## మేము మాట్లాడడానికి లేచినప్పుడల్లా స్పీకర్ మమ్మల్ని అడ్డుకున్నారు



★'ప్రధాని మోదీ ఎప్పుడూ రాజీ పడలేదు'

★రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ రవిశంకర్ ప్రసాద్ కౌంటర్

ఢిల్లీ : లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై వాడివేడి చర్చ జరుగుతోంది. లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ స్పీకర్ పాత్రపై, ప్రధాని మోదీపై కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ , అమెరికా మధ్య జరిగిన వాణిజ్య ఒప్పందం విషయంలో ప్రధాని మోదీ రాజీ పడ్డారని

## లోక్‌సభలో విపక్షాలపై అమిత్ షా ఫైర్- స్పీకర్‌పై వీగిపోయిన అవిశ్వాస తీర్మానం

★లోక్ సభలో స్పీకర్ అవిశ్వాస తీర్మానంపై చర్చ

★పార్లమెంటరీ రాజకీయాల్లో ఇదో దురదృష్టకరమైన ఘటన- అమిత్ షా కీలక వ్యాఖ్యలు



ఢిల్లీ : లోక్ సభలో స్పీకర్ పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం మూజువాణి ఓటుతో వీగిపోయింది. అయితే ఈ ఓటింగ్ కు ముందు అధికార, ప్రతిపక్షాలు ఒకరి మీద ఒకరు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించుకున్నారు. ముఖ్యంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాహుల్ గాంధీపై తీవ్ర విమర్శలు చేశారు. గతంలో రాహుల్ గాంధీ మోదీని కౌగిలించుకుని, తరువాత కన్ను గీటడం లాంటి చర్యలను గుర్తుచేశారు. దీనితో విపక్షాలు అమిత్ షాపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హోంమంత్రి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశాయి. ప్రతిపక్షాల నినాదాల మధ్యే, సభాపతి స్థానంలో ఉన్న జగదాంబికా పాల్ ఓటింగ్ నిర్వహించారు. దీనితో విపక్షాలు పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. అనంతరం లోక్ సభను జగదాంబికా పాల్ రేపటికి వాయిదా వేశారు.

నిప్పులు చెరిగిన అమిత్ షా

అంతకు ముందు అవిశ్వాస తీర్మానంపై మాట్లాడుతూ అమిత్ షా విపక్షాలపై మండిపడ్డారు. లోక్ సభ స్పీకర్ అధికార, విపక్షాలకు సమానంగా ప్రాతినిధ్యం వహించే ఒక నిష్పాక్షిక సంరక్షకుడని అన్నారు. ఓం బిర్లాపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని మిగతా..2లో

### భారత్‌కు వస్తున్న థాయ్‌లాండ్ కార్గో షిప్‌పై క్షిపణి దాడి.. 22 మందిని కాపాడిన నేవీ



మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో హోర్ముజ్ జలసంధి గుండా వెళ్తున్న థాయ్‌లాండ్ కార్గో షిప్‌పై క్షిపణి దాడి జరిగింది. ఒమన్ తీర ప్రాంతం సమీపంలో కార్గో షిప్ మయూరీ నారీని ఇరాన్ ప్రొజెక్టైల్ ఢీకొన్నట్టు థాయ్ అధికారులు తెలిపారు.

### పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై

## కాంగ్రెస్ రాజకీయం చేస్తోంది

### కేరళలో పర్యటిస్తోన్న ప్రధాని మోదీ

- పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులపై కాంగ్రెస్ రాజకీయం చేస్తోందంటూ వ్యాఖ్య
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన



ఢిల్లీ : కేరళ పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ కాంగ్రెస్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులపై కాంగ్రెస్ రాజకీయం చస్తోందని మండిపడ్డారు. దేశంలో జరగుతున్న అభివృద్ధి గురించి వారికి తెలియడం లేదన్నారు. ఒకవైపు, బీజేపీ-ఎన్ డీఏ దేశాన్ని 'ఆత్మనిర్భర్'గా మార్చడానికి అవిశ్రాంతంగా కృషి చేస్తుంటే, కాంగ్రెస్ దాని మిత్రపక్షాలు ఆత్మనిర్భర భారత్ అభియాన్‌ను అపహాస్యం చేయడంలో బిజీగా ఉన్నాయన్నారు. వారు దేశాన్ని విదేశాలపై ఎక్కువగా ఆధారపడేలా చేశారని కాంగ్రెస్ ను ఉద్దేశించి మాట్లాడారు. ఇప్పుడు కాంగ్రెస్, విపక్షాలు కలిసి అసత్యాలను ప్రచారం చేయడంలో నిమగ్నమై ఉన్నారన్నారు. మిగతా..2లో

## ఉగాదికి సామూహిక గృహప్రవేశాలు.. ఏపీ సీఎం చంద్రబాబు ప్రకటన




★రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల మందికి చేకూరనున్న లబ్ధి

★మున్ముందు విద్యుత్ ఛార్జీలు మరింత తగ్గిస్తాం..

★కలెక్టర్ల సదస్సులో ఏపీ సీఎం చంద్రబాబు కీలక నిర్ణయాలు

అమరావతి : ఆంధ్రప్రదేశ్ లో ఉగాది కానుకగా సామూహిక గృహప్రవేశ కార్యక్రమం నిర్వహిస్తామని

## పాలనలో మార్పు రావాలి..

# పరిశుభ్రతపై దృష్టి పెట్టండి



### కలెక్టర్లకు సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు

- స్వచ్ఛాంధ్రపై సీరియస్‌గా ఉండాలని, పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని సూచన
- సచివాలయ సిబ్బంది బదిలీలపై కలెక్టర్లకు పూర్తి అధికారాలు
- కౌలు రైతులకు రుణాల మంజూరులో అడ్డంకులు తొలగించాలని ఆదేశం
- పాలనలో డీప్ టెక్ వినియోగం పెంచాలని దిశానిర్దేశం

అమరావతి : ఆరు జిల్లాల కలెక్టర్లతో సీఎం చంద్రబాబు నిర్వహిస్తున్న కాన్ఫరెన్స్ సమావేశం కొనసాగుతోంది. ఈ సందర్భంగా పలు శాఖల ఉన్నతాధికారులు తమ నివేదికలను ప్రజెంటేషన్ల రూపంలో సమర్పించారు. ఈ సమావేశంలో స్వచ్ఛాంధ్ర, పాలనలో సాంకేతికత వినియోగం, సచివాలయ సిబ్బంది సర్దుబాటు, కౌలు రైతుల సమస్యలపై సీఎం చంద్రబాబు పలు కీలక ఆదేశాలు, సూచనలు జారీ చేశారు. ఇటీవల తాను కాకినాడ, సామర్లకోటలో పర్యటించినప్పుడు రోడ్ల పక్కన చెత్త కనిపించిందని, కొన్ని ప్రాంతాల్లో స్వచ్ఛాంధ్రపై సీరియస్‌నెస్ కొరవడిందని సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్లు పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల కోసం నగరాలు, పట్టణాలు ఒకదానికొకటి పోటీ పడాలని సూచించారు. పరిశుభ్రత మన సంస్కృతిలో భాగమని, ఆరోగ్యానికి ఇది చాలా కీలకమని గుర్తుచేశారు.

## రాష్ట్రాన్ని చంద్రబాబు అప్పుల ఊబిలోకి నెట్టారు



➤బడ్జెట్‌లో అన్నీ మోసపూరిత అంకెలే ఉన్నాయన్న జగన్

➤తాము ఐదేళ్లలో చేసిన అప్పుల కంటే రెండేళ్లలో చంద్రబాబు ఎక్కువ చేశారని ఆరోపణ

➤ట్రెజరీలో మినిమం బ్యాలెన్స్ కూడా ఉండటం లేదని విమర్శ

## మొదటి పేజి తరువాయి

## పాలనలో మార్పు రావాలి.. పరిశుభ్రతపై దృష్టి పెట్టండి:

# కలెక్టర్లకు సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు

గ్రామ, వార్డు సచివాలయాల్లోని సిబ్బంది సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవడం లేదని, ముఖ్యంగా మహిళా పోలీసుల సేవలు వృథా అవుతున్నాయని సీఎం పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, అవసరాన్ని బట్టి సిబ్బందిని ఆర్ అండ్ బి, హెల్త్, మున్సిపల్ వంటి ఇతర శాఖలకు సర్దుబాటు చేసే పూర్తి అధికారాలను కలెక్టర్లకు అప్పగిస్తున్నట్టు ప్రకటించారు. సిబ్బంది బదిలీలు సిఫార్సుల ఆధారంగా కాకుండా, రేషనలైజేషన్ ప్రకారమే పారదర్శకంగా జరగాలని స్పష్టం చేశారు. కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయడంలో ఎలాంటి నిబంధనలు అడ్డంకిగా ఉన్నా వాటిని వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయంతో పాటు ఉద్యాన, పశుసంవర్ధక రంగాల వైపు రైతులను ప్రోత్సహించాలన్నారు. యూరియా వాడకాన్ని తగ్గించేందుకు నానో యూరియాను ఉచితంగా అందించే అవకాశాన్ని పరిశీలించాలని, దీనిపై కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని సూచించారు. ఈ నెల 16, 17, 18, 23, 24, 25 తేదీల్లో 'రైతన్నా మీకోసం' కార్యక్రమాన్ని చేపట్టాలని ఆదేశించారు. పాలనలో ఏఐ, బ్లాక్ చైన్, ఐఓటీ వంటి డీప్ టెక్నాలజీ వినియోగాన్ని పెంచడం ద్వారా వేగంగా, తక్కువ వ్యయంతో ఫలితాలు సాధించవచ్చని సీఎం తెలిపారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగానికి కంప్యూటర్ పరిజ్ఞానాన్ని తప్పనిసరి అర్హతగా చేర్చాలని సాధారణ పరిపాలన శాఖను ఆదేశించారు. ప్రతి జిల్లాలో హెచ్ఆర్ ఇనిస్టిట్యూట్, ఆర్టీజీఎస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకుని పనితీరును మెరుగుపరుచుకోవాలని కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.

# రాష్ట్రాన్ని చంద్రబాబు అప్పుల ఊబిలోకి నెట్టారు

అమరావతి : ఏపీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చిందని వైసీపీ అధినేత జగన్ మండిపడ్డారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఈరోజు నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బడ్జెట్ గణాంకాల నుంచి అవినీతి వరకు పలు అంశాలపై గణంకాలతో సహా విమర్శలు గుప్పించారు. పరిపాలనాదక్షుడిగా బిల్డప్ ఇస్తున్న చంద్రబాబు, వాస్తవానికి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్నీ మోసపూరిత అంకెలే ఉన్నాయని జగన్ ఆరోపించారు. కాగ్ నివేదికను ఉదహరిస్తూ.. ప్రభుత్వం చూపిస్తున్న లెక్కలకు, వాస్తవాలకు పొంతన లేదని విమర్శించారు. "మేము ఐదేళ్లలో చేసిన అప్పుల కంటే చంద్రబాబు రెండేళ్లలోనే ఎక్కువ అప్పులు చేశారు" అని జగన్ ఫైర్ అయ్యారు. వైసీపీ హయాంలో కోవిడ్ కష్టాల్లో కూడా ఎన్బీసీ (నెట్ బారోయింగ్ సీలింగ్ ) పరిమితిని దాటలేదని, కానీ చంద్రబాబు అధికారంలోకి రాగానే నెట్ బారోయింగ్ సీలింగ్ దాటి విచ్చలవిడిగా అప్పులు చేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికే రూ. 3.31 లక్షల కోట్ల అప్పులు దాటేసిందని, జీఎస్డీపీ లో అప్పుల శాతం 5.089కి పెరిగిందని గణాంకాలు వివరించారు. రాష్ట్రానికి రావాల్సిన ఆదాయం పడిపోవడానికి 'దోచుకో.. పంచుకో.. తినుకో..' అనే విధానమే కారణమని జగన్ విమర్శించారు. లిక్కర్ మాఫియా నుంచి భూములు కట్టబెట్టడం వరకు అన్నింటా అవినీతి జరుగుతోందని ఆరోపించారు. విశాఖలో రూ. 5 వేల కోట్ల విలువైన భూములను చంద్రబాబు తన బంధువులకు కట్టబెట్టారని, రియల్ ఎస్టేట్ సంస్థలకు తక్కువ ధరకు భూములు ఇస్తున్నారని ఆరోపించారు. ఫలితంగా ట్రెజరీలో మినిమం బ్యాలెన్స్ కూడా ఉండటం లేదని, ఏడాదిలో కేవలం 8 రోజులు మాత్రమే కనీస నిల్వలు ఉన్నాయని ఎద్దేవా చేశారు. 16 రోజుల అసెంబ్లీ సమావేశాల వల్ల ప్రజలకు జరిగిన మేలు సున్నా అని జగన్ అన్నారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకపోగా, గతంలో తాము ఇచ్చిన పథకాలను కూడా రద్దు చేశారని మండిపడ్డారు.

## ఉగాదికి సామూహిక గృహప్రవేశాలు..

# ఏపీ సీఎం చంద్రబాబు ప్రకటన

ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 2.50 లక్షల మందికి లబ్ధి చేకూరుతుందని ఆయన తెలిపారు. ఈ మేరకు ఈ రోజు సచివాలయంలో నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో ఆయన ఈ ప్రకటన చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ పాలనలో గడిచిన 20 నెలల్లో కీలకమైన పాలనా మార్పులు తీసుకొచ్చినట్లు చెప్పారు. 2047 స్వర్ణాంధ్ర విజన్‌లో భాగంగా 10 సూత్రాల అమలు తీసుకొచ్చామని గుర్తుచేశారు. ప్రభుత్వం తీసుకొచ్చే విధానాలు, పథకాలు దీర్ఘకాలంలో ప్రభావం చూపిస్తాయని.. సూపర్ సిక్స్ సహా వివిధ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయాలని, పథకాల పట్ల ప్రజల్లో అవగాహన పెంచాలని కలెక్టర్లకు సీఎం చంద్రబాబు సూచించారు. నిర్దేశిత లక్ష్యాలను క్షేత్రస్థాయిలో ప్రభావవంతంగా, ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పారదర్శకంగా అమలు చేయాలని చెప్పారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో విద్యుత్ చార్జీలను మరింత తగ్గిస్తామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ట్రూఅప్ పేరిట ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం మోపారని చంద్రబాబు విమర్శించారు. కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టాక ట్రూడౌన్ చేశామని, విద్యుత్ చార్జీల భారం మరింత తగ్గించేందుకు కట్టుబడి ఉన్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

## దానం, కడియంలకు క్లీన్ చిట్ ఇవ్వడంపై కేటీఆర్ ఫైర్

హైదరాబాద్: ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ ఇచ్చిన క్లీన్ చిట్ ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో కార్చిచ్చు రాజేసింది. దానం నాగేందర్, కడియం శ్రీహరిలపై దాఖలైన పిటిషన్లను స్పీకర్ కొట్టివేయడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని ప్రజాస్వామ్యంపై జరిగిన బహిరంగ దాడిగా కేటీఆర్ అభివర్ణించారు. కాంగ్రెస్ పార్టీ బీఫామ్ మీద ఎంపీగా పోటీ చేసిన వ్యక్తికే క్లీన్ చిట్ ఇవ్వడం అంటే ప్రజల తీర్పును అపహాస్యం చేయడమేనని ఆయన మండిపడ్డారు. అధికారంలో ఉన్నవారికి అనుకూలంగా రాజ్యాంగ వ్యవస్థలను వాడుకుంటున్నారని, ప్రజాస్వామ్య విలువలు ఎక్కడ ఉన్నాయని ఆయన ప్రశ్నించారు. ఇది కేవలం ఒక తీర్పు కాదని, పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించే చర్య అని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని ఆయన హెచ్చరించారు.

# జగన్ చిట్టా కేంద్ర ప్రభుత్వం వద్ద ఉంది

జగన్ చిట్టా మొత్తం కేంద్రం వద్ద ఉందని, ఆయన ఢిల్లీకి లేఖలు రాసినా ప్రయోజనం ఉండదని అన్నారు. ఐదేళ్ల పాలనలో నకిలీ మద్యం విక్రయాల ద్వారా జగన్ ప్రభుత్వం మహిళల మాంగల్యాలను తెంపిందని కలిశెట్టి విమర్శించారు. దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా జగన్ ఇప్పుడు సంస్కరణల గురించి మాట్లాడుతున్నారని, ఆయన ప్రెస్ మీట్లు పెట్టుకోవచ్చు కానీ ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని హితవు పలికారు. డిప్యూటీ సీఎం చెప్పినట్టు పవన్ కల్యాణ్ చెప్పినట్లుగా భవిష్యత్తు తరాల సంపద కోసం చంద్రబాబు పాలన అవసరమని, అందుకే కూటమి ప్రభుత్వం ఏర్పడిందని కలిశెట్టి పేర్కొన్నారు. పవన్ వ్యాఖ్యలతో జగన్ గుండెల్లో గుబులు మొదలైందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఒకటో తేదీనే జీతాలు, పింఛన్లు ఇస్తోందని.. తల్లికి వందనం, ఉచిత బస్సు, గ్యాస్ సిలిండర్ వంటి పథకాలతో మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని స్పష్టం చేశారు. ఎన్డీయే కూటమిపై అనవసర ఆరోపణలు చేయడం జగన్ మానుకోవాలని ఆయన హెచ్చరించారు.

## సంక్షోభం వేళ, గ్యాస్ బుకింగ్ పేరుతో

# సైబర్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండండి




ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ఈ కొత్త తరహా మోసాల పట్ల అప్రమత్తం చేశారు. వంట గ్యాస్ సిలిండర్ల కొరత ఉందన్న ఆందోళనను సైబర్ కేటుగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారని, గ్యాస్ బుకింగ్ కోసం ఆన్‌లైన్‌లో వెతికే అమాయకులే లక్ష్యంగా కొత్త తరహా మోసాలకు తెరతీశారని తెలిపారు. తక్షణమే సిలిండర్ డెలివరీ చేస్తామంటూ, అదనపు సిలిండర్లు ఇస్తామంటూ సామాజిక మాధ్యమాల్లో నకిలీ ప్రకటనలు ఇస్తూ బురిడీ కొట్టిస్తున్నారని, వాట్సాప్, ఎస్సెమ్మెస్‌ల ద్వారా ఫేక్ వెబ్‌సైట్ లింకులను పంపిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా, ఆన్‌లైన్‌లో ముందుగా డబ్బులు చెల్లిస్తే గ్యారెంటీగా, అత్యవసరంగా గ్యాస్ సరఫరా చేస్తామని నమ్మబలికే సందేశాలు వస్తే అవి కచ్చితంగా సైబర్ మోసాలేనని గ్రహించాలని ప్రజలకు సూచించారు. ఇలాంటి అనుమానాస్పద లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయకూడదని సూచించారు. సిలిండర్ బుకింగ్ లేదా ఆన్‌లైన్ చెల్లింపుల కోసం గ్యాస్ కంపెనీల అధికారిక వెబ్‌సైట్లను లేదా అధీకృత గ్యాస్ ఏజెన్సీలను మాత్రమే ఆశ్రయించాలని అన్నారు. ఆకర్షణీయమైన ఆఫర్లు చూసి గుర్తుతెలియని వ్యక్తులకు మీ బ్యాంక్ ఖాతా వివరాలు, ఓటీపీ, యూపీఐ పిన్ వంటివి ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోకూడదని సూచించారు.

# పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై కాంగ్రెస్ రాజకీయం చేస్తోంది

## మొదటి పేజి తరువాయి

యుద్ధ సమయంలో కూడా, కాంగ్రెస్, వామపక్షాలు భయాందోళనలు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నాయని మోదీ ధ్వజమెత్తారు. మరోవైపు, పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులపై ప్రధాని మోదీ మాట్లాడారు. "గల్ఫ్‌లోని మిత్రదేశాల ప్రభుత్వాలు మన పౌరులను జాగ్రత్తగా చూసుకుంటున్నాయని నేను సంతృప్తి చెందుతున్నాను. ఆ దేశాల్లోని మన రాయబార కార్యాలయాలు వారికి 24/7 సహాయ సహకారాలు అందిస్తున్నాయి. ఎవరికైనా ఆహారం, వైద్యం,నివాస సహాయాలు అందిస్తున్నాం. వాటితోపాటు చట్టపరమైన సాయం కూడా అందిస్తున్నాం. కానీ ఇంతపెద్ద ప్రపంచ సంక్షోభంలో కూడా కాంగ్రెస్ పార్టీ రాజకీయాలను చేయడం తీవ్ర దురదృష్టం."

**- మోదీ, భారత ప్రధాని**

మరోవైపు, కేరళలో త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల గురించి మోదీ మాట్లాడారు. ఈ సందర్భంగా యూడీఎఫ్ , ఎల్‌డీఎఫ్ లపై విరుచుకుపడ్డారు. "కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని యూడీఎఫ్ ఉంది, అది ముస్లిం లీగ్-మావోయిస్ట్ కాంగ్రెస్ (ఎంఎంసీ)గా మారింది. రాబోయే ఎన్నికలలో గెలవడానికి, కాంగ్రెస్ జమాత్, ఇతర సంస్థలపై ఆధారపడుతోంది. తమ తీవ్రవాద ఎజెండాతో కేరళ శాంతిని దెబ్బతీయాలని ప్రయత్నించే పార్టీలకు, ఎంఎంసీ కాంగ్రెస్ మద్దతు ఇస్తుంది" అని మోదీ ఆరోపించారు. అదేవిధంగా శబరిమల బంగారు తాపడాల చోరీ గురించి మోదీ ప్రస్తావించారు. ఎల్ డీఎఫ్ సభ్యులు బంగారాన్ని దోచుకున్నారని, దాన్ని యూడీఎఫ్ సభ్యులు విక్రయించారని మోదీ ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం యూడీఎఫ్, ఎల్డీఎఫ్ ప్రభుత్వాలను ఎన్నుకునే విధానాన్ని విరమించుకోవాలని ఆయన ప్రజలను కోరారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ, ఎన్ డీఏకు అవకాశం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

కొచ్చి రిఫైనరీలో పాలీప్రొపిలిన్ యూనిట్ ప్రారంభించిన మోదీ

ఈ సందర్భంగా కేరళలో పర్యటించిన మోదీ రూ.10 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. కొచ్చి రిఫైనరీలో 5 వేల 500 కోట్ల రూపాయలతో నిర్మించనున్న పాలీప్రొఫైలిన్ యూనిట్‌కు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. దీంతో మరో 5 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. దేశాన్ని ఆత్మనిర్భర్ భారత్‌గా తీర్చిదిద్దడంలో పెట్రోలియం రంగం విస్తరణ అత్యంత కీలకమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. మేక్ ఇన్ ఇండియా లక్ష్యాన్ని సాధించడంలో కూడా ఈ రంగం ముఖ్య పాత్ర పోషిస్తుందని తెలిపారు. కొచ్చి రిఫైనరీలో ప్రారంభించిన పాలీప్రొపిలిన్ యూనిట్ ప్రతి సంవత్సరం సుమారు నాలుగు లక్షల టన్నుల పాలీప్రొపిలిన్ ఉత్పత్తి చేయగలదని ప్రధాని తెలిపారు. ఈ ఉత్పత్తి ద్వారా ప్యాకేజింగ్, టెక్స్ టైల్, ఆటోమొబైల్, మెడికల్ పరికరాలు వంటి అనేక పరిశ్రమలకు ముడి పదార్థం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. దీంతో దేశీయ తయారీ రంగానికి మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. కృత్రిమ మేధస్సు, సాంకేతికతకు కేరళను కేంద్ర బిందువుగా మార్చడానికి బీజేపీ కృషి చేస్తుందని మోదీ అన్నారు.

### కేరళ పేరు మార్పు- మలయాళ సోదరులకు అద్భుత క్షణం: మోదీ

మరోవైపు, కేరళ రాష్ట్రం పేరును కేరళంగా మార్చడం మలయాళీ సోదరులకు సంతోషకరమైన క్షణమని ప్రధాని మోదీ అన్నారు. మలయాళీల చిరకాల కోరికను కేంద్ర ప్రభుత్వం నేరవేర్చిందన్నారు. ఇది ప్రపంచవ్యాప్తంగా కేరళ ప్రత్యేకతను, సంస్కృతిని ఉన్నతీకరిస్తుందని ఆయన అన్నారు. కేరళలోని కొచ్చిలో జరిగిన అఖిల కేరళ ధీవర సభ స్వర్ణోత్సవ వేడుకల్లో పాల్గొన్న మోదీ ఈ మేరకు ప్రసంగించారు.

# లోక్‌సభలో విపక్షాలపై అమిత్ షా ఫైర్- స్పీకర్‌పై వీగిపోయిన అవిశ్వాస తీర్మానం

## మొదటి పేజి తరువాయి

ఖండించిన ఆయన, సభ అనేది పార్లమెంటరీ నిబంధనల ప్రకారమే నడుస్తుందని, ఆయా రాజకీయపార్టీల రూల్స్ ప్రకారం నడవదని స్పష్టం చేశారు. ఓం బిర్లాను స్పీకర్ పదవి నుంచి తొలగించాలని కోరుతూ విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై లోక్ సభలో మాట్లాడుతూ అమిత్ షా ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. "ఇది సాధారణ విషయం కాదు. దాదాపు 4 దశాబ్దాల తరువాత, లోక్ సభ స్పీకర్ పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం జరిగింది. కొన్ని ప్రతిపక్ష పార్టీలు స్పీకర్ చిత్తశుద్ధిని ప్రశ్నించడం పార్లమెంటరీ రాజకీయాల్లో ఒక దురదృష్టకరమైన విషయం. సభా కార్యకలాపాలు పరస్పర విశ్వాసం ఆధారంగా సాగుతాయి. రాజ్యాంగం స్పీకర్ కు ఒక మధ్యవర్తి (మీడియేటర్ ) పాత్రను ఇచ్చింది. కానీ మీరు ఆ స్పీకర్ పైనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గత 75 ఏళ్లలో మన ఉభయ సభలు ప్రజాస్వామ్య పునాదులను చాలా బలోపేతం చేశాయి. కానీ విపక్షాలు ఆ పునాదుల ప్రతిష్ఠనే ప్రశ్నిస్తున్నాయి. మేము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బీజేపీ-ఎన్ డీఏ ఎన్నడూ లోక్ సభ స్పీకర్ పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టలేదు. మేము ఒక నిర్మాణాత్మక ప్రతిపక్షంగా పనిచేశాం. స్పీకర్ పదవికి ఉన్న గౌరవాన్ని కాపాడాం."



**- అమిత్ షా, కేంద్ర హోంమంత్రి**

'స్పీకర్ చిత్తశుద్ధిని విపక్షాలు ప్రశ్నలు లేవనెత్తడం దేశ ప్రజాస్వామ్య ప్రక్రియనే ప్రశ్నించడంతో సమానం. మనం మన హక్కుల గురించి మాట్లాడవచ్చు. కానీ ఎవరూ సభ నియమాలను ఉల్లంఘించలేరు. స్పీకర్ నిర్ణయాలతో మనం ఏకీభవించలేకపోవచ్చు. కానీ మనం ఆయన మాటలకు కట్టుబడి ఉండాలే తప్ప సందేహించకూడదు. భారత పార్లమెంటరీ చరిత్రలో లోక్ సభ స్పీకర్ పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం ఇది నాలుగోసారి. గతంలో బీజేపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్పీకర్ పై ఎప్పుడూ అవిశ్వాస తీర్మానం పెట్టలేదు' అని అమిత్ షా అన్నారు.

### పరస్పర విశ్వాసం ఉండాలి!

'సభ పరస్పర విశ్వాసంతో నడుస్తుంది. అధికార పక్షానికి, ప్రతిపక్షానికి స్పీకరే సంరక్షకుడు. అందుకే నిబంధనలు రూపొందించబడ్డాయి. ఈ సభ ఒక సంతో (మార్కెట్ ప్లేస్ ) లేదా పండుగో కాదు. ఇక్కడ నిబంధనల ప్రకారమే ముందుకు సాగాలి. సభా నిబంధనలకు వ్యతిరేకంగా మాట్లాడే హక్కు ఎవరికీ లేదు' అని అమిత్ షా పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని వ్యతిరేకించాలనే ఉద్దేశంతో ప్రజాస్వామ్య గౌరవానికి చిహ్నమైన స్పీకర్ పై ప్రశ్నలు లేవనెత్తడం అత్యంత విచారకరమని, అది పూర్తిగా ఖండించదగినదని అమిత్ షా అన్నారు. పార్లమెంటరీ నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్న పదాలను (అన్ పార్లమెంటరీ వర్డ్స్ ) తొలగించే అధికారం స్పీకర్ కు ఉంటుందని, అలాంటి భాషను రికార్డుల నుంచి తప్పక తొలగించాలని అభిప్రాయపడ్డారు. చివరిగా "మీరు మీ హక్కులను కాపాడుకోవచ్చు. కానీ ప్రివిలేజ్ (ప్రత్యేక అధికారం) అనే భ్రమలో జీవించేవారిని వారి పార్టీగానీ, ప్రజలుగానీ రక్షించలేరు. అందుకే వారు క్రమంగా ప్రజల మద్దతును కోల్పోతున్నారు" అంటూ విపక్షాలపై ఆయన విమర్శలు గుప్పించారు.

# భారత్‌కు వస్తున్న థాయ్‌లాండ్ కార్గో షిప్‌పై క్షిపణి దాడి.. 22 మందిని కాపాడిన నేవీ

## మొదటి పేజి తరువాయి

టెహ్రాన్: మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో హోర్ముజ్ జలసంధి గుండా వెళ్తున్న థాయ్‌లాండ్ కార్గో షిప్‌పై క్షిపణి దాడి జరిగింది. ఒమన్ తీర ప్రాంతం సమీపంలో కార్గో షిప్ మయూరీ నారీ (మీఎుబతీవవ చీుతీవవ)ని ఇరాన్ ప్రొజెక్టైల్ ఢీకొన్నట్టు థాయ్ అధికారులు తెలిపారు. థాయ్‌లాండ్ నేవీ, అంతర్జాతీయ తీరప్రాంత అధికారులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. ప్రొజెక్టైల్ దాడితో నౌకలో మంటలు చెలరేగి సగభాగం కాలిపోయిందని, 20 మంది సిబ్బందిని రెస్క్యూ టీమ్ కాపాడగా, మరో ముగ్గురు ఓడలోనే చిక్కుకుపోయారని తెలుస్తోంది. ప్రాథమిక సమాచారం ప్రకారం, మయూరీ నారీ ఇంధన నౌక గుజరాత్‌లోని కాండ్లా పోర్టుకు వస్తుండగా ఈదాడి జరిగింది. మరో రెండు నౌకలు కూడా భద్రతా కారణాలతో హోర్ముజ్ జలసంధిలో చిక్కుకుపోయినట్టు తెలుస్తోంది. ఆయిల్ టాంకర్ల కదలికలను అడ్డుకునేందుకు హోర్ముజ్ జలసంధిని ఇరాన్ బ్లాక్ చేసింది. దీంతో క్రూడాయిల్, గ్యాస్ రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ప్రపంచ దేశాలపై ఇప్పటికే ఈ ప్రభావం కనిపిస్తున్నట్టు ఆందోళనలు వ్యక్తమవుతుండగా, తాజాగా థాయ్‌లాండ్ కార్గోషిప్‌పై దాడి మరింత ఆందోళనకు తావిస్తోంది. ఈ దాడి ఎవరు చేశారనేది ఇంకా నిర్ధారణ కానప్పటికీ, హౌతీ తిరుగుబాటుదారుల పని కావచ్చని వినిపిస్తోంది.

### ఫిరాయింపులపై కేటీఆర్ మాట్లాడటం విడ్డూరం

ఈ సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఫిరాయింపులపై మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కేటీఆర్.. ముందు క్షమాపణలు చెప్పి మాట్లాడాలని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను తీసుకున్నారని.. మండలి చైర్మన్ పదవి లాగేసుకున్నారని గుర్తుచేశారు. తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డిలకు నేరుగా మంత్రి పదవులు ఇచ్చిన విషయాన్ని కేటీఆర్ మర్చిపోయారా అని ప్రశ్నించారు. కేటీఆర్ నీతి మంతుడైనట్టు మాట్లాడుతున్నారంటూ వ్యాఖ్యలు చేశారు. స్పీకర్ తన పరిధి మేరకే నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. 'బీఆర్ఎస్ తీసుకుంటే అభివృద్ధి కోసం.. కాంగ్రెస్ తీసుకుంటే ప్రజాస్వామ్యంపై దాడా' అంటూ మంత్రి మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలకు సిగ్గుండాలని అంటూ మంత్రి సీతక్క తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.



ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందే బీఆర్ఎస్: టీపీసీసీ చీఫ్

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందే బీఆర్ఎస్ అని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ఫిరాయింపుల గురించి కేటీఆర్, బీఆర్ఎస్ నాయకులు మాట్లాడడం సిగ్గుచేటని విమర్శించారు. స్పీకర్ తన అధికార పరిధిలోనే నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. కేటీఆర్, హరీష్ రావు ఏం మాట్లాడినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. రాజ్యాంగాన్ని ఖూనీ చేసిందే బీజేపీ అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి చేస్తుందనే ప్రజలు ఆశీర్వదిస్తున్నారని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# మేము మాట్లాడడానికి లేచినప్పుడల్లా- స్పీకర్ మమ్మల్ని అడ్డుకున్నారు

## మొదటి పేజి తరువాయి

పేర్కొన్నారు. భారత సైన్యం మాజీ అధిపతి జనరల్ మనోజ్ ముకంద్ నరవణె రచించిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకంపై కూడా చర్చ జరగకుండా చేశారని పేర్కొన్నారు. లద్దాఖ్ సంక్షోభ సమయంలో ప్రభుత్వ ప్రతిస్పందన గురించి నరవణె రాసిన విషయాలు చెప్పనివ్వకుండా చేశారని, అందుకే ఆయనపై అవిశ్వాస తీర్మానం పెట్టాల్సి వచ్చిందని అన్నారు. కాగా, జాతీయ భద్రత లాంటి అంశాలపై మాట్లాడేటప్పుడు ప్రతిపక్షనేత ఆచితూచి మాట్లాడాలని, పార్లమెంటరీ నిబంధనలను ఊటంకిస్తూ బీజేపీ నేత రవిశంకర్ చేసిన వ్యాఖ్యలపై కూడా రాహుల్ ఘాటుగా స్పందించారు. చర్చా సమయంలో తన పేరును పదేపదే ప్రస్తావిస్తూ, తనపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. "ఇక్కడ జరుగుతున్న చర్చ ప్రజాస్వామ్య ప్రక్రియ, స్పీకర్ పాత్ర గురించి. కానీ చాలా సార్లు నా పేరు ప్రస్తావ-నకు వచ్చింది. నా గురించి అడ్డగోలుగా మాట్లాడారు. వాస్తవానికి ఈ సభ భారత ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపం. ఇది కేవలం ఒక పార్టీకి మాత్రమే ప్రాతినిధ్యం వహించదు. పార్లమెంట్ అనేది దేశం మొత్తానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. కానీ మేము మాట్లాడడానికి ప్రయత్నించిన ప్రతీసారి మమ్మల్ని అడ్డుకున్నారు. ముఖ్యంగా యూఎస్ తో ట్రేడ్ డీల్ విషయంలో ప్రధాని మోదీ రాజీపడ్డారని చెప్పినప్పుడు నన్ను మాట్లాడనీయకుండా చేశారు. భారతదేశ చరిత్రలో మొదటిసారిగా, ఒక చర్చా సమయంలో ప్రతిపక్ష నేతను మాట్లాడనీయలేదు."



– రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అగ్రనేత

'నేను ఎం.ఎం.నరవాణె రాసిన పుస్తకం గురించిన అంశాన్ని లేవనెత్తాను. ఎప్ స్టీన్ ఫైల్స్ గురించి మాట్లాడాను. అదానీ అంశాన్నీ తెరపైకి తెచ్చాను. కానీ నా గొంతు నొక్కేశారు. ఈ అంశాలు భారత ప్రజలు కచ్చితంగా తెలుసుకోవాల్సిన ముఖ్యమైన అంశాలు. మన ప్రధాని మోదీ రాజీపడ్డారు. దాని ఫలితం అందరికీ తెలుసు' అని రాహుల్ గాంధీ అన్నారు.

### ఖండించిన రవిశంకర్ ప్రసాద్

అంతకు ముందు ఓం బిర్లాపై విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై బీజేపీ నేత రవిశంకర్ ప్రసాద్ మాట్లాడారు. 'స్పీకర్ ను తొలగించే తీర్మానాన్ని ఒక నాయకుడి (రాహుల్ గాంధీ) అహాన్ని సంతృప్తి పరచడానికి ఆయుధంగా వాడుకోకూడదు' అని అన్నారు. కేవలం ఒక నాయకుడి అహంకారం వల్ల ఈ తీర్మానంపై సభ చర్చించాల్సి రావడం బాధాకరమని వ్యాఖ్యానించారు. పార్లమెంటరీ ప్రాక్టీసులు, ప్రొసీజర్లను ఊటంకిస్తూ, ప్రతిపక్ష నేత జాతీయ భద్రత అంశాలపై ఆచితూచి మాట్లాడాలని, పక్షపాత రాజకీయాలకు దూరంగా ఉండాలని సూచించారు. అంతేకాదు మోదీపై రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై రవిశంకర్ ప్రసాద్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఎప్పుడూ రాజీపడలేదని పేర్కొన్నారు. "ఇప్పుడు స్పీకర్పై అవిశ్వాస తీర్మానం ప్రస్తావన వచ్చింది. అయితే పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తినప్పుడు చర్చకు ఆస్కారం లేదు. ప్రతిపక్ష నేతలు స్పీకర్ ను చాలా సార్లు అవమానించారు. ప్రచురించని పుస్తకం గురించి సభలో మాట్లాడడంతోనే వివాదం మొదలైంది. వాస్తవానికి స్పీకర్ పై అవిశ్వాసం ఎప్పుడు పెట్టాలో గతంలో మాజీ ప్రధాని నెహ్రూ స్వయంగా చెప్పారు. తీవ్ర ఆరోపణలు, రుజువులు ఉంటేనే స్పీకర్ పై అవిశ్వాసం పెట్టాలని ఆయన సూచించారు. ప్రతిపక్ష నేత (రాహుల్ గాంధీ) కూడా సభలో భాగమే. ఆయనకు చక్కటి వ్యక్తిత్వం ఉండడం చాలా అవసరం" అని రవిశంకర్ ప్రసాద్ వ్యాఖ్యానించారు. కాగా, రవిశంకర్ చేసిన ఈ వ్యాఖ్యలపై విపక్షాలు నిరసన చేపట్టాయి. దీనితో సభా కార్యకలాపాలు నిర్వహిస్తున్న దిలీప్ సైకియా, రాహుల్ గాంధీని మళ్లీ మాట్లాడడానికి అనుమతి ఇచ్చారు.

# విద్యా సంస్కరణలా.. ఉపాధ్యాయులపై నిందలా?

తెలంగాణ రాష్ట్ర విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేస్తామంటూ ప్రభుత్వం నియమించిన విద్యా కమిషన్ ఇటీవల సమర్పించిన నివేదిక రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. నివేదికలోని కొన్ని అంశాలు ఆకర్షణీయంగా ఉన్నప్పటికీ, లోతుగా పరిశీలిస్తే ఉపాధ్యా యులను ఈ వ్యవస్థలో 'అపరాధులు'గా నిలబెట్టే ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తోంది. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యం బాగున్నా, ఆ లక్ష్య సాధన కోసం కమిషన్ ఎంచుకున్న మార్గాలు, చేసిన సిఫారసులు మాత్రం ఉపాధ్యాయ లోకాన్ని తీవ్ర విస్మయానికి గురి చేస్తున్నాయి.. కేవలం ఉపాధ్యాయులను మాత్రమే బాధ్యులుగా చిత్రీకరిస్తూ, వారిపై నిఘా పెంచడం, శిక్షలు విధించడం వంటి ప్రతిపాదనలు ప్రజాస్వామ్య విలువలకే విరుద్ధంగా ఉన్నాయి.

బోధనేతర పనులపై.. కమిషన్ మౌనం!

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు కేవలం పాఠాలు చెప్పడం లేదు.. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ, బియ్యం నిల్వల లెక్కలు, కోడిగుడ్ల పంపిణీ పర్యవేక్షణ వంటి పనులకే వారి సమయంలోని సగ భాగం సరిపోతోంది. దీనికి తోడు జనాభా గణన, కుల గణన, ఎన్నికల విధుల్లో ఉపాధ్యాయులను భాగస్వాములను చేస్తున్నారు. బోధన నాణ్యత తగ్గడానికి ప్రధాన కారణమైన ఈ 'బోధనేతర పనుల' భారాన్ని తగ్గించాలని ఉపాధ్యాయులు దశాబ్దాలుగా మొత్తుకుంటున్నారు.. అయితే కమిషన్ వీటిని పూర్తిగా పక్కన పెట్టి, కేవలం ఉపాధ్యా యుడి పనితీరునే ఎండగట్టడం పక్షపాత వైఖరి కాదా?

ఉపాధ్యాయుడిని బలిపశువును చేసి..

కమిషన్ నివేదికలో ప్రధానంగా ఉపాధ్యాయుల పని తీరును అంచనా వేసే విధానం అత్యంత వివాదాస్పదం. ప్రతి ఐదేళ్లకోసారి ఉపాధ్యాయుల పనితీరును సమీక్షించి, రెండు సంవత్సరాల తర్వాత ఫలితాలు సంతృప్తికరంగా లేకపోతే వారిని సర్వీసు నుంచి తొలగించవచ్చనే ప్రతిపాదన ఉపా ధ్యాయులను తీవ్ర అభద్రతా భావంలోకి నెట్టి వేస్తోంది. ఒక ప్రభుత్వ ఉద్యోగికి రాజ్యాంగ బద్ధంగా ఉండే ఉద్యోగ భద్రతను కాలరాయడం అంటే, వారిని రాజకీయ నాయకుల లేదా ఉన్నతాధికారుల కక్ష సాధింపులకు బలి చేయడమే! విద్యార్థుల ఫలితాలు కేవలం ఉపాధ్యాయుడి బోధనపైనే ఆధారపడి ఉండవు.. పాఠశాల మౌలిక సదుపాయాలు, విద్యార్థి సామాజిక నేపథ్యం, పోషకాహారం వంటి అనేక అంశాలు ప్రభావితం చేస్తాయి. వీటన్నింటినీ విస్మరించి కేవ లం ఉపాధ్యాయుడిని 'బలిపశువు'ను చేయడం అన్యాయం.

వ్యక్తిగత స్వేచ్ఛపై ఆంక్షలు..

దశాబ్దాలుగా ఉపాధ్యాయులు తమ సీనియారిటీ ఆధారంగా పదోన్నతులు పొందుతున్నారు. వృత్తిపరమైన ఎదుగుదలకు ఒక భరోసా. అయితే, ఆటోమేటిక్ ప్రమోషన్లను రద్దు చేసి, కేవలం 'మెరిట్' లేదా 'పనితీరు' ఆధారంగానే పదోన్నతులు ఇవ్వాలనడం ఉపాధ్యాయుల మధ్య అనారోగ్యకరమైన పోటీని సృష్టిస్తుంది. ఇది పాఠశాలల్లో ఉండాల్సిన సహకార వాతావరణాన్ని దెబ్బతీసి, గ్రూపు రాజకీయాలకు దారి తీస్తుంది. అలాగే ఉపాధ్యాయులు తాము పనిచేసే గ్రామంలోనే నివసించాలనే నిబంధన అశాస్త్రీయమైనది. ఏ ఇతర ప్రభుత్వ శాఖలోనూ ఇలాంటి కఠిన నిబంధన లేదు. కనీస సౌకర్యాలు లేని గ్రామాల్లో నివసించాలని బలవంతం చేయడం మానవ హక్కుల ఉల్లంఘనే అవుతుంది. ఉపాధ్యాయుల వ్యక్తిగత జీవితం, వారి పిల్లల చదువులు, వృద్ధ తల్లిదండ్రుల ఆరోగ్యం వంటి అంశాలను కమిషన్ పూర్తిగా విస్మరించింది.

వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే..

రాష్ట్రంలో వేల సంఖ్యలో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సింగిల్ టీచర్ స్కూళ్లు వందల సంఖ్యలో ఉన్నాయి. మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తుంది. ఈ వైఫల్యాలన్నింటినీ కప్పిపుచ్చుకోవడానికి, ఉపాధ్యాయులే పని చేయడం

# సంపాదకీయం

## నితీశ్ నిష్క్రమణ సూచిస్తున్నదేమిటి?

రెండు దశాబ్దాల నాటి మాట. 2006 జనవరిలో హైదరాబాద్‌లోని బాలయోగి ఆడిటోరియంలో కనీవినీ ఎరుగని రీతిలో కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ జరిగింది. ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ఆయన సహచరుడు కేవీపీ రామచంద్రరావు రాత్రింబగళ్లు కష్టపడి ఈ ప్లీనరీని దిగ్విజయంగా నిర్వహించారు. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ హైదరాబాద్‌లో జరిగిన ఏర్పాట్లు చూసి పొంగిపోయారు. ఇక ఆ తర్వాత జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో కేవీపీకి రాజ్యసభ సీటు ఖాయమేనని ఊహాగానాలు వచ్చాయి. అభ్యర్థుల ఎంపిక సమీపిస్తున్న సమయంలో ఒక రోజు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి దిగ్విజయ్‌సింగ్‌ను అడిగినప్పుడు కేవీపీకే రాజ్యసభ సీటు వచ్చే అవకాశాలున్నాయని చెప్పారు. ఆ విషయం వార్తగా రాశాను. మరునాడు దిగ్విజయ్‌సింగ్‌ను మీడియా కలిసినప్పుడు 'కేవీపీకి రాజ్యసభ సీటు ఇస్తారని వార్త వచ్చింది కదా.. ఆయనకే ఇస్తున్నారా?' అని ఒక మిత్రుడు అడిగాడు. 'ఎవరు చెప్పారు మీకు.. ఇంతకీ కేవీపీ ఎవరు?' అని దిగ్విజయ్‌సింగ్ నవ్వుతూ అడిగారు. ఒక్క రోజులోనే కాంగ్రెస్ అధిష్ఠానం మూడ్ మారిపోయింది. వైఎస్ ప్రత్యర్థులు కొందరు ఢిల్లీలో అధిష్ఠానానికి లేనిపోనివి చెప్పి సోనియా మనసు మార్చేశారు. ఆ రోజుల్లో దాదాపు 16 రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలో ఉండేది. ప్రతి చిన్న విషయానికీ వైఎస్ ఢిల్లీకి వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చేది. తన ఆత్మబంధువుకు రాజ్యసభ సీటు వచ్చేందుకు ఆయన మరో రెండేళ్లు వేచి ఉండాల్సి వచ్చింది. వైఎస్ నాటి పరిస్థితితో పోలిస్తే ప్రస్తుతం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అత్యంత బలవంతుడనే చెప్పాలి. నాడు వైఎస్ తన కుడిభుజంకు రాజ్యసభ సీటు అడిగిన వెంటనే ఇప్పించలేకపోయారు కాని రేవంత్ వేం నరేందర్ రెడ్డికి సీటు ఇప్పించడంలో కృతకృత్యులు కాగలిగారు. కొన్ని దశాబ్దాల పాటు కాంగ్రెస్‌లో విశ్వసపాత్రుడుగా ఉన్న వైఎస్ తన సోదరుడు వివేకానందరెడ్డిని రాజీనామా చేయించి తన కుమారుడు జగన్మోహన్‌రెడ్డికి కడప సీటు ఇప్పించాలనుకున్నా అధిష్ఠానం అందుకు ఒప్పుకోలేదు. కాంగ్రెస్ అధిష్ఠానాన్ని మెప్పించేలా చేసుకోవడానికి వైఎస్‌కు చాలా సంవత్సరాలు పట్టింది. ఆయన చనిపోయిన తర్వాత అధిష్ఠానం ఆయన కుమారుడిపై కేసులు పెట్టించేందుకు కూడా వెనుకాడలేదు. కాని రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరిన నాలుగేళ్లలోపే పీసీసీ అధ్యక్షుడు కావడం, ఆ తర్వాత నాలుగేళ్లకే ముఖ్యమంత్రి కావడం, రాజ్యసభ సీటు విషయంలోనే కాదు, చాలా అంశాల్లో అధిష్ఠానం ఆయన మాటలకు తలొగ్గేలా చేసుకోవడం వెనుక విజయ రహస్యం ఏమిటి? తాజాగా జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి వేం నరేందర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నిక కావడానికి ఎంత రాజకీయ ప్రాముఖ్యత ఉన్నదో, బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ రాజ్యసభకు పోటీ చేయాలని తీసుకున్న నిర్ణయానికి కూడా అంతే ప్రాముఖ్యత ఉన్నదని చెప్పక తప్పదు. ఒకటి మారిన కాంగ్రెస్ అధికార సంస్కృతిని సూచిస్తే రెండవ పరిణామం దేశమంతటా విస్తరిస్తున్న బీజేపీ రాజకీయ అధిపత్య సంస్కృతిని ప్రతిబింబిస్తోంది. బిహార్‌లో దాదాపు రెండు దశాబ్దాల పాటు ముఖ్యమంత్రిగా ఉన్న, ఎన్డీఏ కూటమి గెలుపులో కీలక పాత్ర పోషించిన నితీశ్‌కుమార్ సీఎం పదవిని వదులుకోవడంపై ఆ పార్టీ నేతలు ఇప్పటికీ దిగ్భ్రాంతి నుంచి తేరుకోలేదు. జనతాదళ్(యు) పార్టీ అంతర్గత సమావేశాల్లో పలువురు ఆయన నిర్ణయాన్ని ప్రశ్నించారు. నితీశ్‌కుమార్ 1 అన్నేమార్గ్ నివాసం బయట ఉన్న పార్టీ కార్యాలయాన్ని జేడీ(యూ) కార్యకర్తలు ధ్వంసం చేశారు. నితీశ్ రాజీనామా వెనుక అజ్ఞాత కుట్రదారులు ఉన్నారంటూ నినాదాలు చేశారు. నిన్నమొన్నటి వరకూ నితీశ్ కుమారుడు నిశాంత్ రాజకీయాల్లోకి వస్తారని ఎవరూ ఊహించలేదు. పైగా నితీశ్ పలు సందర్భాల్లో వారసత్వ రాజకీయాలను తీవ్రంగా విమర్శించారు. తన ఇష్టప్రకారమే రాజ్యసభకు రావాలనుకుంటున్నానని నితీశ్ ఎన్ని చెప్పినా ఆయన ముఖ్యమంత్రి పదవిని వదులుకోవడం సహజంగా జరిగిన పరిణామం కాదని ప్రస్తుతం దేశ రాజకీయాలు నడుస్తున్నతీరు గమనిస్తున్న ప్రతి ఒక్కరికీ అర్థమవుతోంది. నిజానికి నితీశ్ పాట్నాను వదులుకుని ఢిల్లీకి రావడానికి అవసరమైన స్క్రిప్టు బీజేపీ ఎప్పటి నుంచో రచిస్తోందని తెలుస్తోంది. ఫిబ్రవరి చివరి వారంలో హోంమంత్రి అమిత్ షా సీమాంచల్ ప్రాంతంలో మూడు రోజుల పాటు జరిగిన పర్యటనలో పార్టీ నేతలతో జరిపిన కీలక చర్చల తర్వాత ఈ మేరకు నిర్ణయం జరిగిందని, మధ్యవర్తుల ద్వారా నితీశ్‌తో సంప్రదింపులు జరిపి తప్పుకోక తప్పదని తేల్చారని రాజకీయ కథనాలు వచ్చాయి. అయితే హిందీ బెల్ట్‌ను పూర్తిగా వశపరుచుకున్న భారతీయ జనతా పార్టీ బిహార్‌ను కూడా పూర్తిగా కైవశం చేసుకోవాలని ఎప్పటి నుంచో వ్యూహరచన చేస్తోంది. బిహార్‌ను పూర్తిగా సైద్ధాంతికంగా స్వాధీనం చేసుకునేందుకు బీజేపీ పావులు కదిపినందువల్లే ఈ పరిణామం జరిగిందని, తద్వారా మొత్తం ఉత్తర భారతంలో అధికార రాజకీయాలను తన పట్టులోకి తీసుకు రాగలిగిందని అనేక మంది రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. 18శాతం ముస్లింలు, బంగ్లాదేశ్‌తో సరిహద్దు ఉన్న బిహార్‌ను హిందుత్వ, జాతీయవాదం విషయంలో ప్రయోగశాలగా మార్చాలని బీజేపీ భావించడంలో ఆశ్చర్యం లేదు. ఈ పరిణామం ఒక రకంగా రక్తరహిత తిరుగుబాటు అని అభివర్ణించినవారు కూడా ఉన్నారు. మండల్ రాజకీయాల మూలంగా బిహార్‌లో పెల్లుబుకిన సామాజిక శక్తుల్లో భాగంగా. సోషలిస్టు నేత కర్పూరీ ఠాకూర్ శిష్యులైన లాలూప్రసాద్ యాదవ్, నితీశ్‌కుమార్ తమను ఎవరూ విస్మరించలేని శక్తులుగా ప్రభవించారు.

# అమెరికా దూకుడు.. ఇరకాటంలో ఇండియా



భారతదేశ ఆహ్వానంపై ఇటీవల అతిథిగా వచ్చివెళ్తున్న ఇరాన్ యుద్ధనౌకను ఓ అమెరికా జలాంతర్గామి మార్గమధ్యంలోనే టార్పెడోతో పేల్చి ముంచేసిన ఘటన సంచలనం సృష్టించింది. ఈ దాడి వల్ల ఇరాన్ నౌకలో కనీసం 80మందికి పైగా నావికులు మరణించారు. ఈ పరిణామం మానవతా కోణం నుంచి అమెరికా వ్యూహాలు, అంతర్జాతీయ చట్టాల వరకు అనేక కీలక ప్రశ్నలను లేవనెత్తుతోంది. అన్నింటినీ మించి ఇది ఇండియాకు తీవ్ర ఇబ్బందికర పరిస్థితిని తెచ్చిపెట్టింది. విశాఖపట్నం సాగర తీరంలో గత నెలలో జరిగిన అంతర్జాతీయ నౌకాదళ విన్యాసాల్లో ఇరాన్ యుద్ధనౌక 'దేనా' సహా సుమారు 70 దేశాల నౌకా దళాలు పాల్గొన్నాయి. విన్యాసాల అనంతరం 'దేనా' స్వదేశానికి తిరిగి బయల్దేరింది. అయితే, శ్రీలంక రేవు గాలే సమీపంలోని అంతర్జాతీయ జలాల్లో మాటువేసిన షార్లెట్ అనే అమెరికా అణు జలాంతర్గామి మార్చి 4న టార్పెడోను ప్రయోగించి 'దేనా'ను ముంచేసింది. 'స్నేహ వారధులు' అనే సందేశంతో భారత్ ఆహ్వానించగా వచ్చిన ఇరాన్ నౌకను అమెరికా ఇలా ముంచేయడం దిల్లీకి సంక్లిష్ట సందేశాలు పంపుతోంది. రెండో ప్రపంచ యుద్ధం తరవాత ఒక అమెరికన్ జలాంతర్గామి శత్రుదేశ యుద్ధనౌకను టార్పెడోతో ముంచేయడం ఇదే మొదటిసారి.

భారత్ గ్రహించాల్సిందేంటి?

హిందూ మహాసముద్రం ఇకపై ప్రధాన దేశాల యుద్ధాలకు దూరంగా ఉండే శాంతి మండలం కాదని అమెరికా పంపిన సందేశంగా 'దేనా'పై దాడిని చూడాలి. పశ్చిమాసియాలో జరుగుతున్న ప్రస్తుత యుద్ధం హర్మూజ్ జలసంధి, అరేబియా సముద్రాలను దాటి హిందూ మహాసముద్రానికి పాకింది. టెహ్రాన్ నౌకాదళ సామర్థ్యాన్ని దెబ్బతీయాలనే అగ్రరాజ్య పట్టుదల ఇరాన్ సాగర సరిహద్దులను దాటి సుదూర జలాలకు విస్తరించింది. ఇది ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు అంతకంతకు తీవ్రతరమవుతున్నట్లు విస్పష్టం చేస్తోంది. వాస్తవానికి, విశాఖ తీరంలో జరిగిన అంతర్జాతీయ నౌకదళ విన్యాసాల్లో 'దేనా'తోపాటు అమెరికాకు చెందిన సాగర నిఘా విమానం కూడా పాల్గొంది. భారత్ ఒక తటస్థ దేశంగా వైరి దేశాలనూ విన్యాసాలకు ఆహ్వానించింది. కానీ, అమెరికా తటస్థంగా వ్యవహరించడానికి సిద్ధంగా లేదని 'దేనా'పై దాడి తేల్చిచెబుతోంది. మహాసాగరాలు పోరాట సీమలుగా మారుతున్నందున, భారత్ జాగ్రత్తగా అడుగులు వేయక తప్పదు. ప్రస్తుతం నడుస్తున్నది బహుళ ధ్రువ ప్రపంచమని భావిస్తున్న భారత్– అన్ని దేశాలనూ కలుపుకొని పోవాలని చూస్తోంది. ఇలాంటి తరుణంలో ఇండియాకు అతిథిగా వచ్చిన తమ నౌకను అమెరికా పేల్చేయడమేంటని ఇరాన్ నిగ్గదీయడం దౌత్యపరంగా భారత్‌కు ఇబ్బంది కలిగించింది. అమెరికా ఆంక్షలు ఎదుర్కొంటున్న దేశాలతో సన్నిహితంగా ఉండటం వల్ల భవిష్యత్తులో ఇలాంటి చిక్కులు తప్పకపోవచ్చని ఈ ఘటన హెచ్చరిస్తోంది. యుద్ధ సమయంలో శత్రుదేశాల యుద్ధనౌకలు రేవులో ఉన్నా, సముద్రంలో ఉన్నా తమ దాడులకు గురికాక తప్పదని వాషింగ్టన్ వాదిస్తోంది. నిజానికి తన అతిథిగా వచ్చిన ఇతర దేశపు నౌక అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించిన తరవాత, ఇక దాని భద్రత విషయంలో ఇండియాకు ఎలాంటి బాధ్యతా ఉండదు!

### మానవతా దృక్పథంతోనే ఆశ్రయం...

సముద్రంలో ఆపదలో చిక్కుకున్న నౌకలకు సాయం అందించడం, ప్రమాదానికి గురైన నౌకల సిబ్బంది కోసం గాలింపు చర్యలు చేపట్టడం వంటివి మానవతా చర్యల కిందికి వస్తాయి. వీటిని అంతర్జాతీయ సాగర చట్టాలు కూడా ప్రోత్సహిస్తున్నాయి. తదనుగుణంగానే ఇరాన్ నౌకలను ఆదుకుంటున్నామని విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ పార్లమెంటులో వివరించారు. ఫిబ్రవరి 28న తమ మూడు నౌకలకు భారత నౌకాశ్రయాల్లో లంగరు వేయడానికి అనుమతించాలని ఇరాన్ కోరినట్లు ఆయన తెలిపారు. ఆ మరుసటి రోజే ఇరాన్ విన్నపాన్ని భారత్ అంగీకరించింది. 'దేనా'ను అమెరికా ముంచేసిన మార్చి నాలుగో తేదీనే మరో ఇరాన్ నౌక 'లావన్' 183 మంది సిబ్బందితో కొచ్చి రేవుకు చేరుకుంది. వారికి భారత నౌకాదళ వసతుల్లో ఆశ్రయం కల్పించారు. ఈ సహాయానికి ఇరాన్ విదేశాంగ మంత్రి భారత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇరాన్ నౌకల్లో సాంకేతిక సమస్యలు తలెత్తినందున ఆశ్రయం కోరారనీ... భారత్ దీన్ని రాజకీయ కోణంలో కాకుండా కేవలం మానవీయ కోణంలోనే చూసిందని జైశంకర్ స్పష్టం చేశారు. అదీకాకుండా ప్రస్తుత యుద్ధం వల్ల సముద్ర మార్గంలో చమురు, గ్యాస్ రవాణాకు చిక్కులు ఎదురవుతున్నాయి. భారత్ తన ఇంధన భద్రత కోసం జాగ్రత్తపడాల్సి ఉంది. హిందూ మహాసముద్రంలో ఆపదకు గురైన నౌకలకు తాను ఆశ్రయం ఇస్తాననే భరోసా భారత్ కల్పించదలచింది. ఇరాన్ నౌకలకు ఆశ్రయం కల్పించడం ద్వారా అమెరికాకు ఆ సందేశాన్నే పంపింది.

### ఇప్పుడు చేయాల్సిందేంటి?

ప్రస్తుతం భారత్‌లో 'లావాన్', శ్రీలంకలో 'బుషెహర్' అనే ఇరాన్ నౌకలున్నాయి. 'దేనా' నౌక నుంచి ప్రాణాలతో బయటపడిన వారిని, ఇతర సిబ్బందిని తక్షణమే ఇరాన్‌కు పంపవద్దని అమెరికా శ్రీలంకను కోరుతోంది. ఈ నావికులను ఇరాన్ ప్రచారం కోసం ఉపయోగించుకోకుండా చూడాలన్నది అమెరికా ఉద్దేశం. ఏదిఏమైనా అంతర్జాతీయ చట్టాల(హేగ్ ఒప్పందం) ప్రకారం, యుద్ధంలో ఉన్న దేశాల సిబ్బందిని తిరిగి పంపకుండా పోరు ముగిసే వరకు తమ దగ్గరే ఉంచాల్సిన బాధ్యత శ్రీలంక, భారత్‌లపై ఉంది. భారతదేశ పెరటిలోకి యుద్ధం విస్తరించడం వల్ల ఇంధన భద్రత, సముద్ర వాణిజ్యంపై తీవ్ర ప్రభావం పడుతుంది. దీనివల్ల ద్రవ్యోల్బణం పెరిగి సరఫరా గొలుసు దెబ్బతినే ప్రమాదముంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇతర దేశాల హితవును, సలహాలను వినే అవకాశం తక్కువ. అయినాసరే, భారత్ ఈ యుద్ధం వల్ల కలిగే నష్టాలను ఎత్తిచూపడం అవసరం. పీపా చమురు ధర వంద డాలర్లు దాటిపోయే పరిస్థితి వచ్చినా తట్టుకోవడానికి భారత్ సిద్ధంగా ఉండాలి. యుద్ధంలో ఉన్న అన్ని పక్షాలు సంఘర్షణ విరమించాలని ఇండియా పిలుపివ్వాలి. ఆయుధాలు మూగబోతేనే చర్చలకు ఆస్కారం ఉంటుంది.

# పండుగల రాజకీయాకరణ.. ప్రజా ధనానికి భారం!




ప్రజలు కష్టపడి సంపాదించిన డబ్బులో నుంచి చెల్లించే పన్నులు ప్రభుత్వానికి ప్రధాన ఆదాయం. ఆ ధనం ప్రజల సంక్షేమం, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం వినియోగించాలనే ఆశ ప్రతి పౌరుడికి ఉంటుంది. అయితే, ఇటీవలి కాలంలో ప్రభుత్వాలు మతపరమైన పండుగలు, వేడుకలను అధికారిక కార్యక్రమా లుగా నిర్వహిస్తూ కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని ఖర్చు చేయడం కొత్త చర్చకు దారితీస్తోంది. దీంతో ప్రజా ధనం వినియోగం అసలు ఎక్కడ ఉండాలి? అనే ప్రశ్న మరింత బలంగా వినిపిస్తోంది.

భారతదేశం ఒక లౌకిక రాజ్యం. లౌకికత అంటే ప్రతి మతాన్ని గౌరవించడం మాత్రమే కాదు.. ప్రభుత్వ వ్యవస్థ అన్ని మతాల పట్ల సమాన దూరం పాటిస్తూ పరిపాలనపై దృష్టి పెట్టడం కూడా. మతపరమైన విశ్వాసాలు వ్యక్తిగతమైనవి, సమాజానికి చెందినవి. అవి కుటుంబాల్లో, సమాజాల్లో, ప్రార్థనా స్థలాల్లో జరిగితేనే వాటి అసలు ఆధ్యాత్మికత నిలుస్తుంది.

ఒక్కరోజు ఖర్చు.. కోట్ల రూపాయలు..!

భారతీయ సమాజంలో పండుగలు ప్రజలే నిర్వహించుకునే సాంస్కృతిక ఆచారాలు.. పండుగలన్నీ ఆయా సమాజాల విశ్వాసాలు, సంప్రదాయాలతో ముడిపడి ఉన్నవి. కుటుంబాలు, సమాజాలు కలిసి స్వయంగా నిర్వహించుకునే ఈ వేడుకల్లోనే వాటి అసలు ఆనందం, ఆధ్యాత్మికత కని పిస్తుంది. అయితే ఇటీవలి కాలంలో ప్రభుత్వాలు ఈ పండుగ లను అధికారిక కార్యక్రమాలుగా నిర్వహిస్తూ ప్రజా ధనాన్ని భారీగా ఖర్చు చేయడం ఒక కొత్త ధోరణిగా మారింది. ఇలాంటి సందర్భాల్లో సామాన్యుడి దృష్టిలో ఒక సహజమైన సందేహం తలెత్తుతుంది. రమజాన్ సమయంలో ఇఫ్తార్ విందులు నిర్వహించడం ముస్లింలకు పవిత్రమైన ఆచారం. రోజంతా ఉపవాసం చేసిన తర్వాత సాయంత్రం ఉపవాసం విరమించడం ఆధ్యాత్మికతకు సంబంధించినది. ఇదే విధంగా బతుకమ్మ పండుగ, క్రిస్మస్ వేడుకలు లేదా ఇతర మత పరమైన పండుగలు కూడా ఆయా సమాజాల విశ్వాసాలకు చెందినవే.. శతాబ్దాలుగా ప్రజలు ఈ పండుగలను తమ ఇళ్లలో, తమ సమాజాల్లో స్వయంగా నిర్వహించుకుంటూ వచ్చారు.. ఇప్పుడు ప్రభుత్వాలు ఈ వేడుకలను ఎందుకు అధికారిక కార్యక్రమాలుగా నిర్వహించాలి? పండుగల సాంస్కృతిక విలువను ఎవరూ ప్రశ్నించరు.. కానీ ప్రజల పన్నుల రూపంలో వచ్చిన ధనాన్ని ఈ కార్యక్రమాలకు వినియోగించడం ఎంతవరకు సమంజసం?

ఈ కార్యక్రమాల పారదర్శకతపై అనుమానాలు..

యాక్టివిస్ట్ లుబ్నా సర్వత్, ఆర్‌టీఐ ద్వారా సేకరించిన సమాచారం ప్రకారం, 2024 మార్చి 15న ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన 'స్టేట్ దావత్-ఎ-ఇఫ్తార్' కార్య క్రమానికి (ఒక పూట సాయంత్రం భోజనానికి) సుమారు రూ.2.77 కోట్ల వరకు ఖర్చు అయినట్లు వెల్లడైంది. ఫర్నిషింగ్స్‌కు కోట్ల రూపాయలు, ఆహ్వాన పత్రాలకు లక్షల రూపాయలు, వంట ఖర్చులకు పెద్ద మొత్తాలు వెచ్చించగా, అనాథలకు ఇచ్చిన దుస్తుల ఖర్చు మాత్రం ఈ మొత్తం వ్యయంతో పోలిస్తే చాలా తక్కువగా ఉండటం గమనించదగ్గ విషయం. సుమారు 12 వేల మందికి ఇచ్చిన ఆ ఇఫ్తార్ విందుకు ఒక్కొక్కరిపై సగటుగా రూ.2,285 వరకు ఖర్చు అయినట్లు లెక్కలు సూచిస్తున్నాయి. అదే సమయంలో రాష్ట్రంలోని మసీదుల్లో నిర్వహించిన ఇఫ్తార్ కార్యక్రమాల్లో ఒక్కో వ్యక్తికి సుమారు రూ.200 ఖర్చుతో వేలాది పేదలకు ఆహారం అందించగలుగుతున్నారు.. ఈ పోలిక ప్రజా ధనం వినియోగంపై సహజంగానే అనేక ప్రశ్నలను లేవనెత్తుతుంది. అలాగే పండుగల పేరుతో జరిగే ఈ కార్యక్రమాల్లో పారద ర్శకతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కొన్నిసార్లు ఈ ఖర్చులు అక్రమాలకు, అవినీతికి మార్గం సుగమం చేస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వం జోక్యం చేసుకోవడమంటే..?

ప్రభుత్వాల అసలు బాధ్యత ప్రజలకు సమర్థవంతమైన పరిపాలన అందించడం. ప్రజలు తమ సంప్రదాయాలను, పండుగలను తామే ఆనందంగా జరుపుకునే స్థాయికి చేరుకునేలా ఆర్థిక, సామాజిక అవకాశాలను కల్పించడం కూడా పరిపాలనలో భాగం. నిజానికి ప్రజలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించినప్పుడు వారు తమ సామర్థ్యానికి అనుగుణంగా పండుగలను తామే ఆనందంగా జరుపుకుంటారు.. అలాంటి వేడుకల్లో ప్రభుత్వం ప్రత్యేక్షంగా జోక్యం చేసుకోవడం ప్రజల ఆర్థిక స్థితి బలహీనతను మాత్రమే కాదు, వారి అభివృద్ధి విషయంలో పాలకుల వైఫల్యాన్ని కూడా ప్రతిబింబిస్తుంది. దానం రూపంలో జరిగే పండుగలు సంబరాల కంటే ఇది రాజకీయ ప్రదర్శనలుగా మారిపోయాయి. అందుకే ప్రభుత్వం ప్రజా పాలన మెరుగుపర్చడంపైనే దృష్టి పెట్టాలి. పౌరుల వ్యక్తిగత ఆచార వ్యవహారాలపై కాదు. విద్యా రంగాన్ని బలోపేతం చేయడం, యువతకు నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించడం, ఉపాధి అవకాశాలు సృష్టించడం, ఆరోగ్య సేవలను మెరుగుపరచడం, మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం. ఇవే ప్రజలు ప్రభుత్వాల నుంచి ఆశించే అంశాలు..

ప్రభుత్వ ప్రాధాన్యతలు స్పష్టంగా ఉండాలి!

ప్రస్తుత పరిస్థితుల్లో నిరుద్యోగం యువతను తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. నైపుణ్యాల లోపం, విద్యలో అసమానతలు కూడా పెద్ద సమస్యలుగా మారాయి. ఇలాంటి సమయంలో కోట్ల రూపాయలను పండుగల ప్రదర్శనలపై ఖర్చు చేయడం కన్నా, అదే ధనాన్ని విద్యారంగం, స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు, స్టార్టప్‌లకు మద్దతు వంటి కార్యక్రమాలకు వినియోగిస్తే సమాజానికి మరింత ప్రయోజనం ఉంటుంది. మతపరమైన విశ్వాసాలు ప్రజల హృదయాలకు సంబంధించినవి. వాటిని ప్రభుత్వం నిర్వహించాల్సిన అవసరం లేదు.. ప్రజలు తమ సంప్రదాయాలను, పండుగలను తామే నిర్వహించుకుంటే ఆ ఆనందం మరింత సహజంగా ఉంటుంది. ప్రభుత్వ వ్యవస్థ మాత్రం అన్ని మతాల పట్ల సమాన దూరం పాటిస్తూ ప్రజల సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి పెట్టాలి. అందుకే ప్రజా ధనం వినియోగంలో ప్రాధాన్యతలు స్పష్టంగా ఉండాలి. ప్రజల భవిష్యత్తును బలోపేతం చేసే రంగాల్లో పెట్టుబడులు పెరగడం అదే ప్రజాస్వామ్య పరిపాలనకు నిజమైన అర్థం.

# సోషల్ మీడియాపై ఉక్కుపాదమా?




భావప్రకటన స్వేచ్ఛే అన్ని స్వేచ్ఛలకు పునాది. మనసులో భావాలు చెప్పుకొనే స్వేచ్ఛ.. ఒక హక్కు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు కూడా అందులో భాగమే. ఆ హక్కు లేకపోతే ప్రజాస్వామ్యానికి అర్థమే ఉండదు. ప్రజాక్షేమం పట్టని పాలకులు, సమాధానాలు చెప్పుకోలేని విఫల నాయకులు, తమ విధానాలపై విశ్వాసంలేని నియంతలు తమను ప్రశ్నిస్తే సహించరు అనేది చరిత్ర చెప్పిన సత్యం. ప్రజాస్వామిక హక్కుల కోసం గొంతెత్తిన ప్రజల, ప్రజల కోసం గొంతెత్తిన ప్రజాస్వామికవాదుల ప్రాణాలు తీసిన పాలకులు చరిత్రలో కనిపిస్తారు. ఆ నెత్తుటి మరకలు చరిత్ర పుటల్లో నిక్షిప్తమై ఉన్నాయి. ఇటీవలి చరిత్ర చూసినా అలాంటి ఆనవాళ్లు మన ముందు ప్రత్యక్ష ఉదాహరణలుగా కనిపిస్తాయి. తాజాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపైనా ఇలాంటి చర్చనే నడుస్తున్నది. సోషల్ మీడియాను నియంత్రించేందుకు కొత్త చట్టం తీసుకొస్తానని సీఎం ప్రకటించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మసిపూసి మారేడు కాయ చేసినట్టుగా ఆయన చెప్పిన మాటలు ఫేక్ న్యూస్ నియంత్రణ అనే రంగును పులిమినట్టు కనిపిస్తున్నది. కానీ రెండేండ్ల కాంగ్రెస్ పాలనలో ఎమర్జెన్సీ తరహా అరెస్టులు, నిలదిస్తే నిర్బంధాలు చూస్తున్నాం. ఇలాంటి అనుభవాల పరంపరలో ఏర్పడిన ఆలోచన దృక్పథంలో చూస్తే రేవంత్‌రెడ్డి మాటల్లో మర్మం అర్థం చేసుకోవచ్చు. సంప్రదాయ మీడియాకు దీటుగా ప్రభావవంతమైన వేదికగా నిలుస్తున్న సామాజిక మాధ్యమాలపైనా పాలకుల కన్నుపడింది. ప్రస్తుతం సోషల్‌మీడియాలో ఏమైనా తప్పులు జరిగితే శిక్షించేందుకు చట్టాలు ఉన్నాయి. ఫేక్‌న్యూస్, దూషణలు, సైబర్ నేరాలను నియంత్రించేందుకు ఐటీ చట్టం, భారతీయ న్యాయ సంహిత, సుప్రీంకోర్టు తీర్పులు, విధివిధానాలు, మార్గదర్శకాలు ఉన్నాయి. మరి కొత్తగా సీఎం తెస్తానన్న చట్టంలో ఏమి ఉండబోతున్నది? అనేది ప్రశ్న. సామాజిక మాధ్యమాల వేదికగా ప్రజలు నిలదీస్తుంటే కాంగ్రెస్ నేతలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సమాధానాలు లేవు కాబట్టిడ అసలు ప్రశ్నలే లేకుండా చేయాలని రేవంత్‌రెడ్డి జిమ్మిక్కులు చేస్తున్నట్టు కనిపిస్తున్నది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు గల్లంతయ్యాయి. గత ప్రభుత్వం అమలు చేసిన మానవీయ పథకాల జాడ ఇప్పుడు లేదు. మోసపోయి గోస పడుతున్నామని ప్రజలు నెత్తీనోరు కొట్టుకుంటున్నారు. ఘనత వహించిన తమ పాలనలో రాష్ట్రం దివాలా తీసిందని ముఖ్యమంత్రి స్వయంగా చెప్పుకొన్నారు. చెత్త తీసుకపోయేటోళ్లు మాట వింటలేరని, పని చేస్తలేరని సెలవిచ్చారు. నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు అన్నట్టుగా సీఎం మాటలు ఉన్నాయి. కనీసం పారిశుధ్య నిర్వహణ కూడా తమకు చేతగావడంలేదని సీఎం మాట్లాడితే ఇక ప్రజలు ఈ కాంగ్రెస్ పాలన గురించి ఏమి అనుకోవాలో ఆయనే చెప్పాలి! రాష్ట్రం పదేండ్ల తర్వాత ఏయే రంగాల్లో ఎలా ఉండాలో ఆలోచించి దార్శనిక ప్రణాళికలు రచించడం, ఆ దిశగా కార్యాచరణ రూపొందించడం, అమలు చేయడం, ఫలితాలు సాధించడం అనే బృహత్తర కార్యాన్ని కాంగ్రెస్ పాలకుల నుంచి ఆశించడం అత్యాశనే అవుతుంది. ఇన్ని అవలక్షణాలు, అడ్డగోలు విధానాలు, పేదల పొట్టగొట్టే అమానవీయ వైఖరులు, ఇండ్లు కూల్చే దుర్మార్గాలు గల పాలకులను ప్రశ్నిస్తుంటే ప్రభుత్వం కేసులు పెట్టి వేధిస్తున్నది. సోషల్ మీడియా వేదికగా జరిగే తప్పుడు ప్రచారం ఎవరికి మేలు చేసిందంటే అది ముమ్మాటికీ కాంగ్రెస్‌కే. బీఆర్ఎస్ ప్రభుత్వంపై కాంగ్రెస్ అనుకూల, చెల్లింపు మీడియా విష ప్రచారం చేసింది. కానీ నాటి ప్రభుత్వం కక్ష సాధింపులకు పోలేదు. మానవీయ దృక్పథంతో, బృహత్తర ఆశయాలతో పని చేసింది. కానీ కాంగ్రెస్ మాత్రం తన ఎమర్జెన్సీ వాసనల నుంచి పూర్తిగా బయటపడనట్టు కనిపిస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం వందల మంది బీఆర్ఎస్ కార్యకర్తలు, సోషల్‌మీడియా వారియర్లపై కేసులు నమోదు చేసింది. ఒకటే అంశంపై పలు పోలీస్ స్టేషన్లలో ఎఫ్ఐఆర్‌లు రిజిస్టర్ చేసి వేధింపులకు పాల్పడుతున్నది. కాంగ్రెస్ అప్రజాస్వామిక వైఖరి హద్దులు దాటడంతో హైకోర్టు మొట్టికాయలు వేసింది. నల్లబాలు కేసులో పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు చెల్లుబాటు కావని తేల్చిచెప్పింది. అయినా ప్రభుత్వం వెనక్కి తగ్గకుండా సుప్రీంకోర్టులో అప్పీలు చేయగా నిరుడు ఫిబ్రవరిలో అత్యున్నత న్యాయస్థానంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వానికి చుక్కెదురైంది. నల్లబాలుపై నమోదైన మూడు ఎఫ్ఐఆర్‌లను ధర్మాసనం రద్దు చేసింది. విమర్శించడం భారత పౌరుడి వ్యక్తిగత స్వేచ్ఛ అని, మూడో వ్యక్తి చేసే ఫిర్యాదుపై కేసులేవీ పెట్టొద్దని, మేజిస్ట్రేట్ ఆదేశిస్తేనే కేసు నమోదు చేయాలని తేల్చిచెప్పింది. 'తలుగు తెంచుకున్న దొంగబర్రెకు ముక్కు తాడు వేసినట్టు'గా కాంగ్రెస్ తీరుపై సుప్రీంకోర్టు తీర్పు ఉన్నది. ప్రభుత్వం కొత్త చట్టాలు తెచ్చినా భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలకు, ఆర్టికల్ 19(1)(ఏ)కు లోబడి ఉండాల్సిందే. ఇక పాలకులు ఓ విషయం గుర్తుంచుకోవాలి. నచ్చని భావాలు వ్యక్తం చేసే ఇతరుల భావప్రకటన స్వేచ్ఛను గౌరవించకపోతే.. తాము అనుభవిస్తున్న స్వేచ్ఛ పట్ల కూడా వారికి నమ్మకంలేదని అనుకోవాల్సి ఉంటుంది.

## ఇండిగో CEO రాజీనామా..!

## ఆయన ప్లేస్‌లో సంస్థను నడిపించేది ఎవరంటే?



భారతదేశంలోని అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో సీఈఓ పీటర్ ఎల్బర్స్ తన పదవికి రాజీనామా చేశారు. గత మూడు నెలలుగా ఎదురైన కార్యకలాపాల సమస్యల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. తాత్కాలికం గా రాహుల్ భాటియా సంస్థ నిర్వహణ బాధ్యతలు చేపడతారు. భారతదేశంలోని అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో సీఈఓ పీటర్ ఎల్బర్స్ మంగళవారం తన పదవికి రాజీనామా చేశారు. గత మూడు నెలలుగా ఎయిర్‌లైన్ కార్యకలాపాల్లో ఎదురైన సమస్యల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. కంపెనీ విడుదల చేసిన ప్రకటన ప్రకారం కొత్త సీఈఓని నియమించే వరకు ఎయిర్‌లైన్ మేనేజింగ్ డైరెక్టర్ రాహుల్ భాటియా సంస్థ నిర్వహణ బాధ్యతలను చేపడతారు. ఇండిగోను నిర్వహిస్తున్న సంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ చైర్మన్ విక్రమ్ సింగ్ మెహతా మాట్లాడుతూ.. కంపెనీ సంస్కృతిని బలోపేతం చేయడం, కార్యాచరణ సామర్థ్యాన్ని మెరుగుపరచడం, వినియోగదారులకు మరింత విశ్వసనీయమైన సేవలను అందించడం లక్ష్యంగా రాహుల్ భాటియా తిరిగి బాధ్యతలు చేపడుతున్నారని తెలిపారు.

### 4,500 విమానాలు రద్దు

గత డిసెంబర్ మొదటి వారంలో ఇండిగో దాదాపు 4,500 విమానాలను రద్దు చేయాల్సి వచ్చింది. పైలట్ డ్యూటీ సమయాలకు సంబంధించిన ప్రభుత్వ నిబంధనలను పాటించడంలో సమస్యలు తలెత్తడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. దీంతో ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి ఎయిర్‌లైన్ క్షమాపణలు చెప్పింది. ఈ సంఘటన భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న విమానయాన రంగంలో పోటీ పరిస్థితులపై కూడా చర్చకు దారి తీసింది. ఇండిగోలో అతిపెద్ద వాటాను ఇంటర్‌గ్లోబ్ ఎంటర్‌ప్రైజెస్ కలిగి ఉంది. డిసెంబర్ నాటికి ఈ సంస్థకు ఇండిగో ఆపరేటర్ అయిన ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్‌లో సుమారు 35.69 శాతం వాటా ఉంది.

### షేర్ మార్కెట్‌లో పెరుగుదల

సీఈఓ రాజీనామా వార్తల మధ్య కూడా కంపెనీ షేర్లు పెరుగుదల నమోదు చేశాయి. ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ లిమిటెడ్ షేర్లు బీఎస్ఈలో 3.46 శాతం లేదా రూ.146.45 పెరిగి రూ.4,382.45 వద్ద ముగిశాయి. ట్రేడింగ్ సమయంలో షేర్ ధర రూ.4,475.25 వరకు పెరిగింది. నిపుణుల ప్రకారం.. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గడం, యుద్ధ ఉద్రిక్తతలు తగ్గవచ్చని డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యల కారణంగా విమానయాన రంగ షేర్లకు మద్దతు లభించిందని చెబుతున్నారు.

## మహిళలకు అదిరిపోయే శుభవార్త.. ష్యూరిటీ లేకుండా 10లక్షల వరకు లోన్.. ఇలా చేస్తే చాలు!



కేంద్ర ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రధాన మంత్రి ముద్ర యోజన పథకం ద్వారా రూ.10 లక్షల వరకు ష్యూరిటీ లేని రుణాలను అందిస్తోంది. సొంత వ్యాపారం ప్రారంభించాలనుకునే లేదా విస్తరించాలనుకునే మహిళలకు ఇది గొప్ప అవకాశం. శిశు, కిషోర్, తరుణ్ లోన్ల ద్వారా ఎలాంటి పూచీకత్తు లేకుండా సులభంగా రుణాలు పొందవచ్చు. కాబట్టి దరఖాస్తు ప్రక్రియ, అవసరమైన పత్రాల ఏమిటో తెలుసుకోండి. ఒకప్పుడంటే మహిళలు కేవలం ఇంటికి మాత్రమే పరిమితమయ్యేవారు. కానీ ఇప్పుడు పురుషులతో సమానంలో అన్ని రంగాల్లో వాళ్లు కూడా రానిస్తున్నారు. పురుషులకు తాము కూడా తక్కువేమి కాదని నిరూపిస్తున్నారు. ఈ నేపథ్యంలో వారిని మరింత ఆర్థికంగా బలపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం సరికొత్త నిర్ణయం తీసుకుంది. ప్రధాన మంత్రి ముద్ర యోజన పథకంతో మహిళల ఆర్థిక ఎదుగుదలకు తోల్పడుతుంది. ఈ పథకం కింద సొంత వ్యాపారం పెట్టుకోవాలనుకునే మహిళలకు కేంద్ర ప్రభుత్వం రూ.10లక్షల వరకు ష్యూరిటీ లేని రుణాలను అందిస్తోంది. కాబట్టి ఈ పథకం కింద ఎలా రుణాలు పొందాలి.. దీనికి ఎలా దరఖాస్తు చేసుకోవాలో పూర్తి సమాచారం తెలుసుకుందాం. ప్రధాన మంత్రి ముద్ర యోజన పథకం ప్రధాన లక్ష్యం ఏమిటంటే స్వయం ఉపాధిని ప్రోత్సహించడం. అంటే ఈ పథకంలో ఉన్న పెద్ద వెసులుబాటు ఏమిటంటే మీరు ఎలాంటి ష్యూరిటీ లేకుండా లోన్ పొందవచ్చు. మహిళా వ్యవస్థాపకులను ప్రోత్సహించడానికి, ముఖ్యం ప్రభుత్వం దీనిని మూడు వర్గాలుగా విభజించింది అవేంటంటే, శిశు లోన్, కిషోర్ లోన్, తరుణ్ లోన్

**మూడు వర్గాలుగా లోన్ విభజన**

శిశు లోన్: ఇది కొత్తగా వ్యాపారాన్ని ప్రారంభించాలనుకునే వారికి లేదా చాలా చిన్న స్థాయిలో ఉన్న వ్యాపారుల కోసం ఉద్దేశించబడింది దీనికి కింద రూ. 50,000 వరకు రుణం పొందవచ్చు.

కిషోర్ లోన్: వ్యాపారాన్ని ఇప్పటికే ప్రారంభించి, దానిని మరికొంత విస్తరించాలనుకునే వారికి ఈ లోన్ ఇస్తారు. దీనికి కింద రూ. 50,000 నుండి రూ. 5 లక్షల వరకు రుణం పొందచ్చు.

తరుణ్ లోన్: ఎవరైనా వ్యాపారం స్టార్ట్ చేసి బాగా నడుస్తుంటే దాన్ని పెద్ద ఎత్తున విస్తరించడానికి లేదా ఆధునీకరించడానికి ఈ లోన్ ఇస్తారు. ఈ పథకం కింద రూ. 5 లక్షల నుండి రూ. 10 లక్షల వరకు రుణం పొందచ్చువు.

**మహిళలకు ప్రత్యేక ప్రయోజనాలు**

ఈ ముద్ర పథకం కింద మహిళా దరఖాస్తుదారులకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుంది. అనేక బ్యాంకులు, ఆర్థిక సంస్థలు మహిళా వ్యవస్థాపకులకు 0.25% నుండి 0.50% వరకు ప్రత్యేక వడ్డీ రేటు రాయితీలను కూడా అందిస్తాయి. అంతేకాకుండా, రుణ ప్రక్రియ కూడా చాలా సులభం, గ్రామీణ, పట్టణ ప్రాంతాల మహిళలు దీని నుండి ఎక్కువ ప్రయోజనం పొందవచ్చు.

ఏ ప్రయోజనం కోసం రుణం పొందవచ్చు?

మీ ఆసక్తిని బట్టి మీరు ఏదైనా చిన్న వ్యాపారానికి దరఖాస్తు చేసుకోవచ్చు, టైలరింగ్ లేదా బోటిక్ షాప్, లేదా బ్యూటీ పార్లర్ లేదా సెలూన్ , టిఫిన్ సర్వీస్ లేదా ఊరగాయ-తాటి వ్యాపారం, చేతిపనులు, కుటీర పరిశ్రమలు, కిరాణా దుకాణం లేదా ఏదైనా చిన్న తయారీ యూనిట్ ఇలా మీరు ఏ వ్యాపారం పెట్టుకోవాలి అన్న ముద్ధ పథకం కింద లోన్ పొందచ్చు. దరఖాస్తు చేయాలి?

# ఏటీఎంలు వాడేవారికి గుడ్ న్యూస్.. ఇక నుంచి రూ.10, రూ.20, రూ.50 నోట్లు కూడా విత్ డ్రా.. ఎలానో చూడండి..



చిన్న విలువ నగదు డిమాండ్‌ను నోట్లు, నాణేల కలయిక ద్వారా తీర్చవచ్చని కేంద్ర ప్రభుత్వం రాజ్యసభలో ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి కీలక ప్రకటన చేశారు. ఏటీఎంల ద్వారా చిన్న కరెన్సీ నోట్ల విత్ డ్రాపై ప్రకటన చేశారు. ఏటీఎంలలో ప్రస్తుతం రూ.500, రూ.200, రూ.100 నోట్లు వస్తున్నాయి. అన్నింటికంటే రూ.500 నోట్లు ఎక్కువగా వస్తున్నాయి. అయితే పెద్ద నోట్లను మాత్రమే ఏటీఎం నుంచి విత్ డ్రా చేసుకునే వెసులుబాటు ఉండగా.. చిన్న నోట్లను ఉపసంహరించుకునే సదుపాయం ఇప్పటివరకు అందుబాటులో లేదు. అయితే త్వరలో ఏటీఎం నుంచి రూ.10, రూ.20, రూ.50 లాంటి చిన్న నోట్లను కూడా విత్ డ్రా చేసుకోవచ్చు. ఈ విధానాన్ని ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం పైలట్ ప్రాజెక్టుగా సాంప్రదాయ ఏటీఎంల నుంచి చిన్న విలువ కలిగిన నోట్లను పంపిణీ చేసే కార్యక్రమం మొదలైందని రాజ్యసభలో కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. దేశంలో చిన్న నోట్ల కొరత లేదని స్పష్టం చేశారు.

### తగినంతగా అందుబాటులో..

పార్లమెంట్‌లో ఓ ప్రశ్నకు పంకజ్ చౌదరి సమాధానమిస్తూ.. దేశంలో చిన్న నోట్ల కొరత లేదని, తగినంతగా అందుబాటులో ఉన్నాయని చెప్పారు. రూ.10, రూ.20, రూ.50 చిన్న విలువ కలిగిన నోట్లు ఇప్పటికే తగినంత సంఖ్యలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రూ.500, రూ.100, రూ.200 నోట్లు ఏటీఎంల నుంచి ఎక్కువగా వస్తున్నాయి. వీటి ద్వారా ఏదైనా కొనుగోలు చేయాలంటే చిల్లర సమస్య ఏర్పడుతుంది. ఇక ప్రజలు ఆన్‌లైన్‌లో ఎక్కువగా చెల్లింపులు చేయడం వల్ల చిన్న నోట్ల కొరత ఏర్పడుతుంది. అయితే దీనికి చెక్ పెట్టేందుకు ఏటీఎంల నుంచి చిన్న నోట్లను కూడా పంపిణీ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. చిల్లర సమస్యను అధిగమించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పంకజ్ చౌదరి స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రత్యేక చిన్న విలువ డిస్పెన్సర్లు పరీక్షించబడుతున్నాయని, ఇవి ప్రజలు నేరుగా చిన్న కరెన్సీ నోట్లను విత్ డ్రా చేసుకోవడానికి సహాయపడుతుందన్నారు. ప్రజలను ఏటీఎంల నుంచి ఈ విధానంలో చిల్లర పొందగలుగుతారని పేర్కొన్నారు.

### ఎన్ని నోట్లు ఉన్నాయంటే..?

చిన్న కరెన్సీ నోట్లు ఎన్ని అందుబాటులో ఉన్నాయనే దానిపై కేంద్ర ప్రభుత్వ రాజ్యసభలో వివరాలు వెల్లడించింది. ఫిబ్రవరి 26 వరకు కేంద్ర బ్యాంకు రూ.439.4 కోట్ల విలువైన రూ.10 నోట్లు సరఫరా చేయగా.. రూ.193.7 కోట్ల రూ.20 నోట్లు, రూ.130 కోట్ల రూ.50 నోట్లు సరఫరా చేసినట్లు తెలిపింద. ఇక గత ఆర్థిక సంవత్సరంలో రూ.180 కోట్ల రూ.10 నోట్లు, రూ.150 కోట్ల రూ.20 నోట్లు సరఫరా చేయగా.. ఇక రూ.300 కోట్ల రూ.50 నోట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పంపిణీ చేసినట్లు స్పష్టం చేసింది. వివిధ విలువల కరెన్సీలకు ఉన్న డిమాండ్‌ను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా క్రమం తప్పకుండా సమీక్షిస్తుందని, ఎన్ని నోట్లను ముద్రించాలో సిఫార్సు చేస్తుందని పేర్కొంది.

## ఈపీఎఫ్‌వో ఉద్యోగులకు శుభవార్త.. త్వరలోనే రూ.7,500కి పెరగనుందా..? కేంద్రం నిర్ణయం..!




ఈపీఎఫ్‌వో పెన్షన్ పరిమితి పెంచాలనే డిమాండ్లు తీవ్రతరం అవుతున్నాయి. ప్రస్తుతం కనీస పెన్షన్ లిమిట్ రూ.వెయ్యిగా ఉంది. అయితే దీనిని రూ.7,500కు పెంచాలనే డిమాండ్లు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం త్వరలోనే పెంచుతుందని వార్తలు వినిపిస్తున్నాయి. కానీ ఇప్పటివరకు క్లారిటీ లేదు. ఈపీఎఫ్‌వో కనీస నెలవారీ పెన్షన్ ప్రస్తుతం రూ.వెయ్యిగా ఉండగా.. దీనిని పెంచాలనే డిమాండ్లు ఎప్పటినుంచో వినిపిస్తున్నాయి. ఉద్యోగ సంఘాలు కేంద్ర ప్రభుత్వంపై గత కొన్నేళ్లుగా ఈ విషయంపై ఒత్తిడి తీసుకొస్తున్నాయి. అంతేకాకుండా ఆందోళన కూడా చేపడుతూ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతూనే ఉన్నాయి. ఈపీఎస్-95 పథకం కింద కనీస పెన్షన్ రూ.వెయ్యిగా 2014లో నిర్ణయించారు. అయితే గత 11 ఏళ్లుగా ఇందులో ఎలాంటి మార్పులు చేయలేదు. పెరుగుతున్న ఖర్చులు, పెరుగుతున్న ద్రవ్యల్బణం, మెడికల్ ఖర్చులను దృష్టిలో పెట్టుకుని పెన్షన్ పరిమితిని పెంచాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి. అందులో భాగంగా మార్చి 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద నిరసన కార్యక్రమాలను చేపడుతున్నాయి. ఈ ఆందోళనల్లో పెద్ద సంఖ్యలో పెన్షనర్లు పాల్గొంటున్నారు. ఈపీఎస్-95 జాతీయ ఆందోలన కమిటీ ఆధ్వర్యంలో ఈ ఆందోళనలు జరుగుతున్నాయి.

### రూ.7,500కు పెంచాలని డిమాండ్

ప్రస్తుతం ఈపీఎఫ్‌వో కనీస నెలవారీ పెన్షన్ పరిమితి రూ.వెయ్యి ఉండగా.. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల క్రమంలో రూ.7,500కు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. దాదాపు 30 నుంచి 35 సంవత్సరాలుగా లక్షలాది మంది పెన్షనర్లు ఈపీఎఫ్‌వోకు విరాళాలు అందిస్తున్నారు. ప్రస్తుతం సగటు నెలవారీ పెన్షన్ రూ.1,171గా ఉంది. అయితే తమ రోజువారీ ఖర్చులను ఈ పెన్షన్ సరిపోవడం లేదని పెన్షనర్లు డిమాండ్ చేస్తున్నారు. అనేక ప్రభుత్వ పథకాలు చందాలు కూడా లేకుండా పెన్షన్ అందిస్తున్నాయని చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న పెన్షన్ రిటైర్మెంట్ అయ్యాక వృద్ధాప ఖర్చులకు సరిపోవడం లేదని వాపోతున్నారు. ప్రస్తుతం ఉన్న ద్రవ్యోల్బణంతో పోలిస్తే పెన్షన్ సొమ్ము చాలా తక్కువగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీస పెన్షన్ పరిమితి రూ.7,500కు పెంచి మెరుగైన సామాజిక భద్రత లభిస్తుందని డిమాండ్ చేస్తున్నారు.

### డూ ఆర్ డై పేరుతో నిరసన

డూ ఆర్ డై పేరుతో ఉద్యోగ సంఘాలు ఈ నిరసన చేపడుతున్నాయి. వివిధ రాష్ట్రాల్లోని పెన్షనర్లు ఈ ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. అనేక రాజకీయ పార్టీల ఎంపీలు కూడా ఈ నిరసనలకు మద్దతు తెలుపుతున్నారు. ఇక పెన్షన్ పరిమితి పెంచడంతో పాటు డియర్ నెస్ అలవెన్స్, కుటుంబ పెన్షన్, పెన్షనర్ల కుటుంబసభ్యులు ఉచిత ఆరోగ్య సంరక్షణ కోసం డిమాండ్ చేస్తున్నారు. నవంబర్ 4,2022న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం అర్హులైన ఉద్యోగులందరికీ అధిక పెన్షన్ ప్రయోజనాలు అందించాలని డిమాండ్ చేస్తున్నారు. 8.1 మిలియన్ల మంది పెన్షనర్లు తొమ్మిది ఏళ్లుగా పెన్షన్ లిమిట్ పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. కానీ ప్రభుత్వం నుంచి క్లారిటీ రావడం లేదు.

## FDI నిబంధనల్లో సడలింపు! ఇక చైనా కంపెనీలకు తలుపులు తెరిచినట్టేనా?



ప్రధాని మోదీ అధ్యక్షతన కేంద్ర క్యాబినెట్ ఖీణ× నిబంధనల్లో కీలక మార్పులు చేసింది. 2020లో భూ సరిహద్దు దేశాల పెట్టుబడులకు తప్పనిసరి అనుమతి విధానాన్ని (ప్రెస్ నోట్-3) సడలించింది. దీనివల్ల చైనా వంటి దేశాల కంపెనీలు భారతీయ సంస్థలతో జాయింట్ వెంచర్‌లు ఏర్పాటు చేయడానికి సులభతరం అవుతుంది. IBC, కార్పొరేట్ చట్టాల్లో సవరణలకూ ఆమోదం లభించింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (FDI) నిబంధనల్లో కీలక మార్పులు చేశారు. ఈ నిర్ణయంతో భారతదేశంతో భూ సరిహద్దు పంచుకునే దేశాల నుంచి వచ్చే పెట్టుబడులకు కొంత ఉపశమనం లభించింది. ముఖ్యంగా చైనాకు చెందిన కంపెనీలు భారతీయ సంస్థలతో కలిసి జాయింట్ వెంచర్‌ల ద్వారా వ్యాపారం చేయడానికి మార్గం సుగమమైంది. 2020లో కోవిడ్ మహమ్మారి సమయంలో కేంద్ర ప్రభుత్వం ప్రెస్ నోట్-3 అనే విధానాన్ని అమలు చేసింది. దీని ప్రకారం భారత్‌తో భూ సరిహద్దు పంచుకునే దేశాల నుండి వచ్చే పెట్టుబడులకు తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి అవసరం. దీనిని అవకాశవాద టేకోవర్లు లేదా భారతీయ కంపెనీలను విదేశీ సంస్థలు ఆక్రమించకుండా నిరోధించడానికి తీసుకువచ్చారు. అయితే ఇప్పుడు కేంద్రం ఆ నిబంధనల్లో కొంత సడలింపు ఇచ్చింది. దీని వల్ల చైనా సహా సరిహద్దు దేశాలకు చెందిన కంపెనీలు భారతీయ సంస్థలతో కలిసి పెట్టుబడులు పెట్టడానికి సులభతరం అవుతుంది. ఇప్పటికే కొన్ని భారతీయ కంపెనీలు చైనా సంస్థలతో జాయింట్ వెంచర్‌ల కోసం ఎదురుచూస్తున్నాయి.

### IBC, కార్పొరేట్ చట్టాల్లో మార్పులు

ఈ సమావేశంలో ప్రభుత్వం ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్టసీ కోడ్‌కు సంబంధించిన సవరణలకూ ఆమోదం తెలిపింది. 2025లో తీసుకురాబోయే సవరణల ద్వారా దివాలా ప్రక్రియను మరింత సులభతరం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే కార్పొరేట్ చట్టాల సవరణ బిల్లుకూ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం చైనా భారత్‌కు రెండవ అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది. 2024-25లో భారత్ నుంచి చైనాకు ఎగుమతులు 14.25 బిలియన్ డాలర్లు కాగా, 2023-24లో ఇది 16.66 బిలియన్ డాలర్లుగా ఉంది. మరోవైపు చైనా నుంచి దిగుమతులు 113.45 బిలియన్ డాలర్లకు పెరిగాయి. దీంతో రెండు దేశాల మధ్య వాణిజ్య లోటు కూడా పెరిగింది. 2023-24లో ఇది సుమారు 85 బిలియన్ డాలర్లు ఉండగా, 2024-25లో 99.2 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్-జనవరి కాలంలో భారత్ చైనాకు ఎగుమతులు 15.88 బిలియన్ డాలర్లు, దిగుమతులు 108.18 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

# తెలుగు రాష్ట్రాలకు మరో అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్.. రేపే ప్రారంభం.. రూట్, టైమింగ్స్ ఇవే..



తెలుగు రాష్ట్రాల రైల్వే ప్రయాణికులకు శుభవార్త. ఏపీ, తెలంగాణకు రైల్వేశాఖ మరో అమృత్ భారత్ రైలు ప్రకటించింది. ఇది తమిళనాడు నుంచి కేరళ మీదుగా ఏపీ, తెలంగాణకు సర్వీసులు అందించనుంది. ఈ నెల 11వ తేదీన దీనిని ప్రారంభించనున్నారు. ఈ మేరకు ప్రకటన వచ్చింది. తెలుగు రాష్ట్రాల రైల్వే ప్రయాణికులకు తీపికబురు. ఈ మేరకు రైల్వేశాఖ శుభవార్త అందించింది. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో అనేక అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు సర్వీసులు అందిస్తుండగా.. మరో రైలు సామాన్య ప్రయాణికుల కోసం ప్రవేశపెట్టేందుకు రెడీ అయింది. ఈ మేరకు రైలు ప్రారంభానికి ముహూర్తం కూడా ఫిక్స్ అయింది. ఈ కొత్త అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌ను మార్చి 11వ తేదీన ప్రారంభించనున్నట్లు రైల్వేశాఖ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. అలాగే ఈ రైళ్ల టైమ్ షెడ్యూల్స్, ఏయే స్టేషన్లలో ఆగుతుంది? అనే వివరాలను కూడా ప్రకటించింది. వాటి వివరాలు ఏంటో ఒకసారి చూద్దాం.

### ఈ ప్రాంతాల మధ్య సర్వీసులు

నాగర్ కోయిల్-చర్లపల్లి-నాగర్ కోయల్ మధ్య కొత్త అమృత్ భారత్ రైలు ప్రారంభించేందుకు రైల్వే బోర్డు అనుమతులు మంజూరు చేసినట్లు మార్చి 10వ తేదీన దక్షిణ మధ్య రైల్వే ఓ ప్రకటన విడుదల చేసింది. తమిళనాడులోని నాగర్ కోయిల్, హైదరాబాద్‌లోని చర్లపల్లి మధ్య ఈ రైలు సర్వీసులు అందించనుంది. బుధవారం ఈ రైలు ప్రారంభం కానుంది. నాగర్ కోయిల్-చర్లపల్లి(06357) రైలు బుధవారం 17.30 గంటలు నాగర్ కోయిల్ నుంచి బయల్దేరుతుంది. వల్లియూర్ స్టేషన్‌కు 18.20, తిరుణవెల్లికి రూ.19.35, కొవిల్ పట్టికి 20.33, సాతూర్‌కు 20.53కు, విరుదునగర్‌కు 21.53 గంటలకు, మధురైకు 22.40కు, దుండిగల్‌కు 23.43కు, తిరుచాచిపల్లి 01.40, తంజావూర్ 02.43, పాపానాశనంకు 03.05 గంటలకు, కుంభకోణంకు 03.18కు, చిదంబరంకు 5 గంటలు, విల్లుపురం జంక్షన్‌కు 06.55 గంటలకు, చెన్నై ఎగ్మోర్‌కు 09.55కు, సుళ్లూరుపేటకు 11.48కు, నెల్లూరుకు 13.18కు, ఒంగోలుకు 14.48కు, చీరాలకు 15.20కు, బాపట్లకు 15.35కు, తెనాలికి 16.48 గంటలకు చేరుకుంటుంది.

### నాలుగు రాష్ట్రాలకు కనెక్టివిటీ

ఇక గుంటూరుకు 17.40 గంటలకు, సత్తెనపల్లికి 18.59 గంటలకు, మిర్యాలగూడకు 20.59 గంటలకు, నల్లగొండకు 21.29 గంటలకు చేరుకోనుంది. ఇక చర్లపల్లికి 23.45 గంటలకు చేరుకుంటుందని రైల్వేశాఖ తన ప్రకటనలో తెలిపింది. ఈ రైలు తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కేరళ రాష్ట్రాలను కవర్ చేస్తోంది. దీంతో నాలుగు రాష్ట్రాల రైల్వే ప్రయాణికులకు ప్రయోజనం కలగనుంది. ఇందులో నాన్ ఏసీ స్లీపర్, జనరల్ క్లాసులు అందుబాటులో ఉంటాయి. సదూర ప్రాంతాలకు వెళ్లేవారికి ఇది సేవలు అందించనుంది. తక్కువ ధరతో వీటిల్లో ప్రయాణం చేయవచ్చు. ఇప్పటికే హైదరాబాద్ నుంచి రెండు అమృత్ భారత్ రైళ్లు ప్రయాణం చేస్తున్నాయి. ఇది మూడో అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌గా చెప్పవచ్చు. అటు త్వరలో చర్లపల్లి-కామాఖ్య మధ్య మరో అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ అందుబాటులోకి రానుంది. ఇప్పటికే రైల్వేశాఖ నుంచి ప్రకటన రాగా.. త్వరలోనే ప్రారంభించనున్నారని తెలుస్తోంది.

## తపాస్‌పల్లి పాఠశాలలో ఉత్సాహంగా స్వయంపాలన దినోత్సవం...



కొమురవెల్లి//**మార్చి 11 (ఆకాంక్ష) :** కొమురవెల్లి మండలం తపాస్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం స్వయంపాలన దినోత్సవం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పాఠశాలకు చెందిన 6వ, 7వ తరగతుల విద్యార్థులు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.స్వయంపాలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులు వివిధ హోదాల్లో బాధ్యతలు స్వీకరించి పాఠశాల నిర్వహణలో భాగమయ్యారు. 7వ తరగతి విద్యార్థిని పూజిత డీఈఓగా, అక్షర ఎంఈఓగా వ్యవహరించగా, 6వ తరగతి విద్యార్థి శివ గణేష్ పాఠశాల హెచ్‌ఎంగా బాధ్యతలు నిర్వహించారు. మిగతా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తరగతుల్లో పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ప్రతిరోజూ ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు వినే తమకు ఈ రోజు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు చెప్పడం ఒక కొత్త అనుభూతిని ఇచ్చిందన్నారు. పాఠాలు బోధించడం వెనుక ఉన్న శ్రమ, బాధ్యతలు తమకు ఇప్పుడు స్పష్టంగా అర్థమయ్యాయని తెలిపారు. ఉపాధ్యాయులు ఎంత కష్టపడి బోధిస్తారో ఈ కార్యక్రమం ద్వారా తెలుసుకున్నామని పేర్కొన్నారు.కార్యక్రమం అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు జ్ఞాపికలను అందజేసి అభినందించారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా హరికృష్ణ ఎంపికయ్యారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అష్రఫ్ అహ్మద్, ఉపాధ్యాయులు రామచంద్రారెడ్డి, లక్ష్మయ్య, మహేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ పుట్ట కనకరాజు, కార్యదర్శి మురళీకృష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు పుట్ట రమేష్, ఈగ కనకరాజు, చంద్రమౌళి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అతుకూరి మొల్లమాంబ విగ్రహానికి స్థలం కేటాయించాలి...

### జిల్లా కమిటీ సభ్యులు, జిల్లా అధ్యక్షులు ఉరుకొండ రఘుబాబు డిమాండ్...




నాగర్‌కర్నూల్ టౌన్//**మార్చి 11 (ఆకాంక్ష) :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కుమ్మరుల ఆరాధ్య దైవంగా భావించే కవయిత్రి అతుకూరి మొల్లమాంబ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద ఆమె విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి స్థలం కేటాయించాలని కుమ్మర్ల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు, జిల్లా అధ్యక్షులు ఉరుకొండ రఘుబాబు మాట్లాడుతూ కవయిత్రి అతుకూరి మొల్లమాంబ తెలుగు సాహిత్యంలో విశిష్ట స్థానం సంపాదించిన మహానుభావురాలని తెలిపారు. ఆమె రచనలు తెలుగు సాహిత్య సంపదకు గొప్ప కీర్తిని తెచ్చాయని పేర్కొన్నారు. అలాంటి గొప్ప కవయిత్రి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం ద్వారా ఆమె సేవలను గుర్తించాలని కోరారు.అలాగే హైదరాబాద్ ట్యాంక్ బండ్ పై ప్రముఖ మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేసినట్టే అతుకూరి మొల్లమాంబ విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.తెలంగాణ రాష్ట్రంలో కుమ్మర్ల సమాజానికి చెందిన ఈ మహనీయురాలికి ప్రభుత్వం తగిన గౌరవం ఇవ్వాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మసిగుండ్ల వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షులు మధునాగుల సుల్తాన్, బొడ్డుపల్లి జంగయ్య, గౌరవ సలహాదారులు బొడ్డుపల్లి బాలస్వామి, మంతటి సర్పంచ్ సుగురు శ్రీనివాసులు, రాజకీయ విభాగం కో-కన్వీనర్ మరియు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బొడ్డుపల్లి రాములు, నాగర్‌కర్నూల్ మండల అధ్యక్షులు బొడ్డుపల్లి చిన్న రాములు, బిజినపల్లి మండల అధ్యక్షులు మాడుగుల స్వామి, సింగిల్ విండో డైరెక్టర్ బొడ్డుపల్లి తిరుపతయ్య పాల్గొన్నారు.అదేవిధంగా తిరుమల్, సుల్తాన్, బాలనాగులు, రాములు, గుండూరు రాము తదితర కుల బంధువులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## విద్యార్థులు మత్తుకు బానిస కాకూడదు...

### ప్రధానోపాధ్యాయులు సయ్యద్ మైనుద్దీన్....




నగర్ కర్నూల్ టౌన్//**మార్చి 11 (ఆకాంక్ష) :**విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి కష్టపడి చదివి నూటికి నూరు శాతం ఫలితాలు సాధించాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాలెం ప్రధానోపాధ్యాయులు సయ్యద్ మైనుద్దీన్ సూచించారు. విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాల పేరు గొప్పగా నిలబెట్టేలా కృషి చేయాలని, భవిష్యత్తులో తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆయన అన్నారు.నాగర్ కర్నూల్ మండలంలోని పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 202526 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదవ తరగతి విద్యార్థులకు బుధవారం ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సయ్యద్ మైనుద్దీన్ మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో సన్మార్గంలో నడవాలని సూచించారు. ఒక నీటి బిందువు కాలుతున్న ఇనుప కడ్డీపై పడితే ఎలా ఆవిరైపోతుందో, అదే విధంగా మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితమే నశించిపోతుందని తెలిపారు. అదే నీటి బిందువు ముత్యపు చిప్పలో పడితే ముత్యంగా మారినట్లుగా విద్యార్థులు తమ జీవితాన్ని గొప్పగా మలుచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తొమ్మిదవ తరగతి విద్యార్థులు పదవ తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులకు పరీక్షల సమయంలో పాటించాల్సిన మెలకువలు, చదువు పట్ల చూపాల్సిన క్రమశిక్షణ గురించి వివిధ సూచనలు చేశారు. ప్రతి సబ్జెక్టుకు చెందిన ఉపాధ్యాయులు పరీక్షల్లో విజయాన్ని సాధించడానికి అవసరమైన మార్గదర్శకాలను తెలియజేశారు.ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులు తమ అనుభవాలను పంచుకుంటూ జీవితంలో ఉన్నత స్థానాలను చేరుకోవాలని తమ లక్ష్యాలను వెల్లడించారు. భవిష్యత్తులో ఐఏఎస్, ఐపీఎస్, లాయర్, చార్టెడ్ అకౌంటెంట్, సివిల్ ఇంజనీర్, ఉపాధ్యాయ వృత్తి వంటి వివిధ రంగాల్లో రాణించాలని తమ ఆకాంక్షలను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు పూర్ణచంద్ర, కదా మేడం, తిరుపతమ్మ మేడం, సంధ్య మేడం, గాయత్రి మేడం, రాజు సార్, రాఘవేందర్ రెడ్డి సార్, శివశంకర్ సార్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య ముగిసింది.



## గోదావరిఖనిలో బైక్ దొంగతనం కేసు ఛేదన...

### పోలీసుల అదుపులో నిందితుడు, బైక్ స్వాధీనం...



గోదావరిఖనిటౌన్//**మార్చి 11 (ఆకాంక్ష) :**పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణంలో జరిగిన బైక్ దొంగతనం కేసును పోలీసులు త్వరితగతిన ఛేదించి నిందితుడిని అదుపులోకి తీసుకుని దొంగిలించిన మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు రామగుండం పోలీస్ కమీషనరేట్ బుధవారం పత్రికా ప్రకటన విడుదల చేసింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోదావరిఖని హనుమాన్ నగర్‌కు చెందిన రేగుల వెంకటేష్ పాలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 10వ తేదీ ఉదయం సుమారు 9.30 గంటల సమయంలో టిఫిన్ చేయడానికి లక్ష్మీనగర్‌లోని మున్సిపల్ కాంప్లెక్స్ వద్దకు తన ఞా 22 5029 నంబర్ గల ఫ్యాషన్ ప్రో మోటార్ సైకిల్‌పై వెళ్లాడు. కాంప్లెక్స్ వెనుక భాగంలో బండిని పార్క్ చేసి టిఫిన్ చేయడానికి వెళ్లిన అనంతరం కొద్దిసేపటికి తిరిగి వచ్చి చూడగా అక్కడ పార్క్ చేసిన బండి కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా బండి ఆచూకీ లభించకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు తన మోటార్ సైకిల్‌ను దొంగిలించారని రేగుల వెంకటేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.ఫిర్యాదు అందుకున్న వెంటనే ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి ఆదేశాల మేరకు ఎస్సై మనోహర్ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు బైక్‌ను దొంగిలించిన వ్యక్తిని గుర్తించారు. అనంతరం ప్రత్యేక చర్యలు చేపట్టి నిందితుడిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి దొంగిలించిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై మనోహర్ తెలిపారు.

# 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి...

### మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్...




పెద్దపల్లి//**మార్చి 11 (ఆకాంక్ష) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేయాలని, అభివృద్ధి పనులు ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలని ఆయన సూచించారు. ప్రజా ప్రతినిధులు పారదర్శకంగా, బాధ్యతతో పనిచేసి ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉండాలని పేర్కొన్నారు. బుధవారం పెద్దపల్లి జిల్లాలోని రంగాపూర్ రాధాకృష్ణ ఏసీ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' శిక్షణ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్‌తో కలిసి మంత్రి ప్రజా ప్రతినిధులకు మార్గనిర్దేశం చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రత్యేక కార్యక్రమం మార్చి 6 నుంచి జూన్ 12 వరకు కొనసాగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా మార్చి 15 వరకు పెండింగ్ ఫైళ్ల పరిష్కారం, గ్రామాలు మరియు పట్టణాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సర్పంచ్ స్థాయి నుంచి మంత్రి వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేసి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలన్నారు.గత ప్రభుత్వం విఫలమైన అనేక రంగాల్లో ప్రస్తుత ప్రభుత్వం సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని మంత్రి వివరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం సరఫరా వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు. రాబోయే బడ్జెట్‌లో పంచాయతీలు, మున్సిపాలిటీలు, అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమానికి ప్రత్యేక నిధులు కేటాయించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో ఎక్కడా తాగునీటి కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు.అదే విధంగా 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలకు భారీ ఏర్పాట్లు చేయడంతో పాటు దేవాలయాల అభివృద్ధికి కూడా నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలు, పథకాల అమలు విధానం గురించి ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధులు తమ సందేహాలను నివృత్తి చేసుకుని గ్రామాలు, పట్టణాల్లో పారదర్శకంగా అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు.రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కట్టుబడి ఉందన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా పనిచేస్తోందని తెలిపారు. ప్రజా ప్రతినిధులు పారిశుద్ధ్యం, చెట్ల పెంపకం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో రామగుండం మేయర్ మహంకాళి స్వామి, పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు మరియు జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# కండరాలు బలంగా ఉండాలా - నిపుణులు సూచిస్తున్న డైట్ టిప్స్ ఇవే!

### పోషకాహారంతో పాటు వ్యాయామం తప్పనిసరి- మెనూలో వీటిని చేర్చుకుంటే మంచిదంటున్న నిపుణులు!



మనం రోజూ రకరకాల పనులు చేస్తుంటాం. నడవటం వంటి తేలికైన పనుల దగ్గర నుంచి బరువులు ఎత్తటం వంటి కష్టమైన పనుల వరకూ ఎన్నెన్నో చేస్తుంటాం. వీటి అన్నింటినీ సజావుగా చేయాలంటే కండరాలు బలంగా ఉండటం ఎంతో అవసరం. కానీ, వయసు మీద పడుతున్న కొద్దీ మన కండరాల బలం కూడా తగ్గిపోతుందని నిపుణులు చెబుతున్నారు. అలాగే, కొంతమంది బరువు ఎక్కువగా ఉండటం వల్ల కండరబలం క్షీణిస్తుందని అంటున్నారు. ఈ క్రమంలో కండరాల సామర్థ్యం పెరగాలంటే ఎలాంటి డైట్ తీసుకోవాలో నిపుణులు వివరిస్తున్నారు. అది ఇప్పుడు తెలుసుకుందాం!

కండరాల క్షీణతకు కారణాలు :

మధ్యవయసు నుంచి ఏటా 1-2 శాతం చొప్పున కండరాలు క్షీణిస్తుంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇలా 80 ఏళ్లు వచ్చేసరికి సుమారు 40 శాతం కండరాల మోతాదు తగ్గిపోవచ్చని అంటున్నారు. ఈ క్రమంలో శారీరక శ్రమ లేకపోవటం, టెస్టోస్టెరాన్, గ్రోత్ హార్మోన్ వంటి హార్మోన్లు తగ్గటం, వయసుతో పాటు శరీరంలో తలెత్తే వాపు ప్రక్రియ.. ప్రొటీన్ తగినంత తీసుకోకపోవటం వంటివన్నీ కండరాల క్షీణతకు దారితీస్తుంటాయని పేర్కొంటున్నారు. కాలి కండరాలు బలహీనమైతే నడక వేగం తగ్గడంతో పాటు కింద పడిపోయే ముప్పు పెరుగుతుందంటున్నారు నిపుణులు. అయితే, కండరాలకు కాసింత పని చెప్పటం, సమతులాహారం తీసుకోవటం ద్వారా దీన్ని నెమ్మదింపజేసుకునే అవకాశం ఉందని పలు అధ్యయనాల్లో వెల్లడైంది. ముఖ్యంగా, మధ్యవయసు నుంచే కొన్ని జాగ్రత్తలు తీసుకోవటం మంచిదట.

బలోపేతానికి ఏం చేయాలి :

బరువు ఎక్కువగా ఉన్నవారు అదుపులో ఉండటంతో పాటు కొవ్వు శాతాన్ని తగ్గించుకుని కండరాల దృఢత్వాన్ని పెంచుకోవాలంటున్నారు ప్రముఖ పోషకాహార నిపుణులు డాక్టర్ లతాశశి. ఇందుకు పోషకాహారం ఒక్కటే సరిపోదని చెబుతున్నారు. బ్రిస్క్ వాకింగ్, స్విమ్మింగ్, సైక్లింగ్ వంటి వ్యాయామాలు వారానికి 4-5 రోజులు 30 నిమిషాల పాటు తప్పనిసరిగా చేయాలని అంటున్నారు. ఇవి చేస్తూనే క్యాలరీలు తక్కువ, ప్రొటీన్ ఎక్కువగా ఉంటే.. బ్రౌన్ రైస్, మిల్లెట్స్ తో చేసిన చపాతీ, పప్పు దినుసులు, పనీర్, సోయా వంటి వాటిని ఆహారంలో భాగం చేసుకోవాలని సూచిస్తున్నారు. అలాగే, ఆకుకూరలు, కాయగూరల్ని తక్కువ నూనెతో వండి తినాలని సలహా ఇస్తున్నారు. చికెన్, చేపలు, గుడ్డు ఆహారంలో తప్పనిసరిగా ఉండాలని తెలియజేస్తున్నారు. అలాగే, రోజూ తినే ఆహారంలో ఆయిల్ నాలుగు టీస్పూన్లకు మించనీయొద్దని పేర్కొంటున్నారు. మైదా, బేకరీ పదార్థాలు, రిఫైన్డ్ ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలని అంటున్నారు. సుమారు 124 గ్రా. చొప్పున పండ్లు, సలాడ్లు రోజూ తినడం వల్ల జీవక్రియ మెరుగుపడుతుందని చెబుతున్నారు. నట్స్, సీడ్స్ ను మితంగా తీసుకోవాలని వివరిస్తున్నారు. వీటితో పాటు 7-8 గంటలు నిద్ర అవసరమని సూచిస్తున్నారు. రోజూ 3 లీటర్ల నీళ్లు తప్పనిసరిగా తాగాలని సలహా ఇస్తున్నారు.

నెమ్మదిగా కదులుతూ, కదలికలపై మనసు పెట్టి చేసే యోగా, తాయ్ చీ వంటి సంప్రదాయ పద్ధతులు కూడా ఎంతో మేలు చేస్తాయని అష్ట్రం.బని అధ్యయనం పేర్కొంది. ఇవి కండరాలను, కీళ్లను బలోపేతం చేయటంతో పాటు శరీరం తూలిపోకుండానూ కాపాడతాయంటున్నారు నిపుణులు. అంతేకాదు, మానసిక ప్రశాంతత కూడా చేకూరుతుందని చెబుతున్నారు. కండరాల బలం పెరగటానికి బరువులను వ్యతిరేక బలాన్ని తట్టుకునే వ్యాయామాలు బాగా ఉపయోగపడతాయని నిపుణులు చెబుతున్నారు. అందువల్ల శక్తిని బట్టి బరువులు ఎత్తటం, సాగే బ్యాండ్ల వంటి పరికరాలతో వ్యాయామాలు చేయడం మేలంటున్నారు. ముందు చిన్న బరువులతో ప్రారంభించి, క్రమంగా పెంచుకుంటూ రావాలని సూచిస్తున్నారు. దీంతో తుంటి, మోకాలు, మడమలు, భుజాల కండరాలు బలోపేతమవుతాయని పేర్కొంటున్నారు. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# ఈ సప్లిమెంట్లను మీరు తరచూ వాడుతున్నారా.. అయితే జాగ్రత్త.. హెచ్చరిస్తున్న వైద్యులు..

ఈ మధ్యకాలంలో చాలా మంది సప్లిమెంట్స్ మీద ఆధారపడుతున్నారు. ఆరోగ్యాన్ని పెంచడానికి , పోషక అంతరాలను పూరించడానికి అనేక వనమూలికలను తీసుకుంటున్నారు. ఇవన్నీ కూడా సహజమైనవి, సురక్షితమైనవి అని లేబుల్ చేయబడి ఉంటున్నాయి. దీంతో వీటిని ఉపయోగించే వారు ఇవన్నీ కూడా సురక్షితమైనవి అని భావిస్తున్నారు.

ఈ సప్లిమెంట్లను మీరు తరచూ వాడుతున్నారా.. అయితే జాగ్రత్త.. హెచ్చరిస్తున్న వైద్యులు..

ఈ మధ్యకాలంలో చాలా మంది సప్లిమెంట్స్ మీద ఆధారపడుతున్నారు. ఆరోగ్యాన్ని పెంచడానికి , పోషక అంతరాలను పూరించడానికి అనేక వనమూలికలను తీసుకుంటున్నారు. ఇవన్నీ కూడా సహజమైనవి, సురక్షితమైనవి అని లేబుల్ చేయబడి ఉంటున్నాయి. దీంతో వీటిని ఉపయోగించే వారు ఇవన్నీ కూడా సురక్షితమైనవి అని భావిస్తున్నారు. కానీ లేబుల్ చేయబడిన మాత్రాన ఇవన్నీ సురక్షితం కావనీ వైద్యులు చెబుతున్నారు. వీటిని వాడడం వల్ల కాలేయం, మూత్రపిండాలు దెబ్బతినే అవకాశం ఎక్కువగా ఉంటుందని ఈ మందులు ముఖ్యమైన అవయవాలపై అదనపు ఒత్తిడిని కలిగిస్తాయని వైద్యులు తెలియజేస్తున్నారు. సప్లిమెంట్స్, మూలికా మందులు అందరికీ సురక్షితం కావని ఇవి ఒక్కొక్కరిపై ఒక్కోలా ప్రభావం చూపిస్తాయని వైద్యులు చెబుతున్నారు. చాలా మంది ఎక్కువగా ఉపయోగించే కొన్ని రకాల సప్లిమెంట్స్, మూలికలు శరీరంపై ఏ విధంగా ప్రభావం చూపిస్తాయో ఇప్పుడు తెలుసుకుందాం.

గ్రీన్ టీ క్యాప్సుల్స్..

గ్రీన్ టీ ని చాలా మంది తాగుతూ ఉంటారు. ఒక కప్పు గ్రీన్ టీ తాగడం సురక్షితమైనదే. అయితే గ్రీన్ టీ ని సులభంగా తయారు చేసి తీసుకోవడానికి చాలా మంది క్యాప్సుల్స్ ను ఉపయోగిస్తున్నారు. అయితే ఈ క్యాప్సుల్స్ లో అధిక స్థాయిల్లో కాటెకిన్లు ఉంటాయి. ముఖ్యంగా అధిక మొత్తంలో ఉండే జు+జ+ కాలేయ మంటను, తీవ్రమైన కాలేయ అనారోగ్యాన్ని కలిగిస్తుంది. కాలేయ సంబంధిత సమస్యలతో బాధపడే వారిలో ఈ ప్రమాదం మరింత ఎక్కువగా ఉంటుంది. కనుక గ్రీన్ టీ క్యాప్సుల్స్ ను తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించడం మంచిది.

ప్రోటీన్ పౌడర్లు..

అలాగే రోజూ వ్యాయామం చేసేవారు ప్రోటీన్ పౌడర్లను ఎక్కువగా తీసుకుంటారు. కానీ వీటిని వైద్యుడిని సంప్రదించకుండా ఎక్కువగా తీసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. వీటిని ఎక్కువగా తీసుకోవడం వల్ల శరీరంలో నైట్రోజన్ వ్యర్థాలు ఎక్కువగా తయారవుతాయి. ఈ వ్యర్థాలను బయటకు పంపించడానికి మూత్రపిండాలు అదనంగా పని చేయాల్సి వస్తుంది. మూత్రపిండాలపై ఒత్తిడి ఎక్కువగా పడడం వల్ల వాటి పనితీరు మందగించడంతో పాటు మూత్రపిండాల వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కండరాల పెరుగుదలకు ప్రోటీన్ పౌడర్ అవసరమైనప్పటికి దీనిని అతిగా తీసుకోవడం వల్ల మూత్రపిండాలు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది.



విటమిన్ సప్లిమెంట్లు..

కొవ్వులో కరిగే విటమిన్ ఎ, డి, ఇ, కె వంటి వాటిని కూడా ఈ మధ్య కాలంలో చాలా మంది తీసుకుంటున్నారు. ఈ విటమిన్లు కొవ్వు కణజాలాల్లో పేరుకుపోతాయి. వీటిని ఎక్కువగా ఎక్కువగా తీసుకోవడం వల్ల కొవ్వు కణజాలల్లో అధికంగా నిల్వ చేయబడతాయి. ముఖ్యంగా విటమిన్ ఎ ను అధికంగా తీసుకోవడం వల్ల కాలేయంపై ఒత్తిడి ఎక్కువగా పడుతుంది. మూత్రపిండాల వ్యాధులు ఉన్న వారు వైద్యుడిని సంప్రదించకుండా ఈ విటమిన్లను తీసుకోకపోవడమే మంచిది. అలాగే ఐరన్ సప్లిమెంట్స్ వాడకం కూడా పెరిగిందని చెప్పవచ్చు. వీటిని అధికంగా తీసుకోవడం వల్ల కణజాలాల్లో ఐరన్ పేరుకుపోయి హిమోక్రోమాటోసిస్ అనే పరిస్థితి నెలకొనే అవకాశం ఉంది. దీని వల్ల అవయవాల పనితీరు తగ్గుతుంది. దీర్ఘకాలిక నష్టం కలుగుతుంది. అలాగే కాంఫ్రే( సౌరక చెట్టు) వంటి హెర్బల్ మూలికలను ఉపయోగించే వారు కూడా జాగ్రత్తగా ఉండాలి. వీటిలో కాలేయానికి తీవ్రమైన నష్టాన్ని కలిగించే సమ్మేళనాలు ఉంటాయి. ఈ మూలికలను అధికంగా తీసుకోవడం వల్ల కాలేయం తీవ్ర అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంటుంది.

అతిమధురం వేర్లు..

లికోరైస్ రూట్ ను కూడా కొన్ని రకాల నివారణలల్లో ఉపయోగిస్తారు. దీనిని అధికంగా వాడడం వల్ల పొటాషియం స్థాయిలు తగ్గుతాయి. రక్తపోటు తగ్గుతుంది. మూత్రపిండాలు, గుండె జబ్బులతో బాధపడే, అంతర్లీన ఆరోగ్య సమస్యలతో బాధపడే వారికి ఇది మరింత ప్రమాదకరంగా ఉంటుంది. అదే విధంగా డిటాక్స్, కొవ్వును కరిగించే సప్లిమెంట్స్ త్వరిత ఫలితాలను ఇస్తాయి. అయితే ఇవి కాలేయ జీవక్రియ ప్రక్రియను, మూత్రపిండాల వడపోత ప్రక్రియను మందగించేలా చేస్తాయి. వీటిని అధికంగా వాడడం వల్ల కాలేయంపై తీవ్ర ఒత్తిడి పడుతుంది. కాలేయ వ్యాధులు ఉన్నవారు మరింత ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. సప్లిమెంట్స్ ను, మూలికలను తీసుకోవడం మంచిదే అయినప్పటికీ వీటిని తగిన మోతాదులో వైద్యుడి సూచనల మేరకు ఉపయోగించడం మంచిది. సప్లిమెంట్స్ ను అధికంగా ఉపయోగించడం వల్ల కాలేయం, మూత్రపిండాలతో పాటు శరీర ఆరోగ్యం కూడా దెబ్బతినే అవకాశం ఉంటుంది కనుక వీటిని తగిన మోతాదులో వైద్యుడిని సంప్రదించిన తరువాత ఉపయోగించడం మంచిది.

## ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్...



గద్వాల//మార్చి 11 (ఆకాంక్ష) : గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్యులు,సిబ్బంది సమయానికి విధులకు హాజరవుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. బుధవారం ఆయన జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వివిధ వార్డులను సందర్శిస్తూ అక్కడ చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్య సేవలు, మందుల సరఫరా, ల్యాబ్ రిపోర్టులు, సర్జరీల నిర్వహణ వంటి అంశాలపై వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, సెక్యూరిటీ,శానిటేషన్ సూపర్‌వైజర్లు, ఇతర సిబ్బంది వంద శాతం హాజరు ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. ప్రతి రోజు సిబ్బంది హాజరు వివరాలు తప్పనిసరిగా బయోమెట్రిక్ వ్యవస్థ ద్వారా నమోదు చేయాలని ఆదేశించారు. బయోమెట్రిక్ యంత్రాలలో ఏవైనా సాంకేతిక సమస్యలు ఉన్నట్లయితే రెండు రోజుల్లోపు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలోని కొన్ని వార్డుల్లో ఫ్యాన్లు పనిచేయడం లేదని గమనించిన కలెక్టర్ వాటిని వెంటనే మరమ్మతు చేయించాలని సూచించారు. రోగులకు వేగంగా వైద్య సేవలు అందించేందుకు టోకెన్ సిస్టమ్ అమలు చేయాలని సూచించారు. ఆసుపత్రి టాయిలెట్లను ప్రతి రెండు గంటలకు ఒకసారి శుభ్రం చేసి శుభ్రత వివరాలను ప్రత్యేక చార్ట్‌లో నమోదు చేయాలని శానిటేషన్ సిబ్బందికి ఆదేశించారు. అలాగే ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచి పిచ్చి మొక్కలు లేకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు.అదేవిధంగా ఆసుపత్రిలోని ల్యాబ్, రేడియాలజీ, డయాగ్నోస్టిక్ సెంటర్లను పరిశీలించిన కలెక్టర్ ల్యాబ్ రిపోర్టులు, అత్యవసర పరీక్షలు త్వరితగతిన పూర్తి చేసి రోగులకు అందించాల్సిందిగా సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్ఎంవో హేమలత, డాక్టర్లు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## తుకారాంగేట్ పోలీసేషన్ ను అడ్డగుట్ట దివిజన్ లోనే ఉంచాలి...

నార్త్ జోన్ ప్రాంతాలను లాలాగూడ పీఎస్లో కలుపవద్దు...

అడ్డగుట్ట డివిజన్ అబిలపక్ష, వివిధ పార్టీల నేతల డిమాండ్...

మాకు న్యాయం జరుగని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తాం...



హైదరాబాద్//మార్చి 11 (ఆకాంక్ష) : తుకారాంగేట్ పోలీసేషన్ పరిధిలో ఉన్న ప్రాంతాల సరిహద్దులను లాలాగూడ పోలీస్నేష నకు లింకు చేయొద్దని అడ్డగుట్ట డివిజన్ అబిలపక్ష, వివిధ పార్టీల నేతలు కోరారు. ఈ విషయమై పోలీస్ కమిషనర్ సజ్జనా రన్ను కలిసి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకుడు వి.నరింగ్ రావు, సేవాలాల్ లంబాడా వేల్ఫేర్ అసోసేషన్ రాష్ట్ర అధ్యక్షులు వి.శ్రీరాం నాయక్, సీపీఐ పార్టీ సికింద్రాబాద్ జోన్ కార్య దర్శి ఆర్.మల్లేష్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గద్దం మల్లేష్, టీడీపీ పార్టీ గ్రేటర్ నాయకుడు ఈ.చందర్ ముదిరాజ్, బీఎస్పీ సికింద్రా బాద్ ఇన్చార్జి నర్సింగ్రావు, సోషల్ వర్కర్(ఎంసీహెచ్ క్వార్టర్) మహ్మద్ ఆజీంల తో కలిసి మాట్లాడారు. మార్పులు చేర్పుల కారణంగా 2.కిలోమీటర్ల దూరం లో ఉన్నా లాలాగుడా పోలిసు స్టేషన్ అడ్డగుట్ట, తుకా రాంగేట్ ప్రాంతవాసులు ఇబ్బందులు పడతారన్నారు.ముఖ్యంగా రవాణా సౌకర్యం లేని లాలాగూడ పీఎస్ కు అడ్డగుట్ట ప్రజలు రాత్రి పూట వెళ్ళాలంటే ఆప్రాంతం భీకటిగా నిర్మానుష్యం గా ఉన్నుదని ఇలాంటి ప్రాంతాన్ని మాకు లింకు కలుపడం సరైంది కాదన్నారు.గతనెల పోలిసు ఉన్నతాదికారులు ఇచ్చిన హామీని నేరవేర్చాలని,మాకు న్యాయం జరుగని పక్షం లో పెద్ద ఎత్తున ఆందోళన, ర్యాలీలు, రోడ్లపై వంటా వార్పు నిర్వహిస్తామని వారు హెచ్చరుంచారు. ఈ సమావేశం లో సేవాలాల్ లంబాడా వేల్ఫేర్ అసోసేషన్ అధ్యక్షులు వి.శ్రీరాం నాయక్, సీపీఐ పార్టీ సికింద్రాబాద్ జోన్ కార్య దర్శి ఆర్.మల్లేష్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గద్దం మల్లేష్, టీడీపీ పార్టీ గ్రేటర్ నాయకుడు ఈ.చందర్ ముదిరాజ్, బీఎస్పీ సికింద్రా బాద్ ఇన్చార్జి నర్సింగ్రావు, సోషల్ వర్కర్(ఎంసీహెచ్ క్వార్టర్) మహ్మద్ ఆజీంలు ఉన్నారు.

## డెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్...




హైదరాబాద్//మార్చి 11 (ఆకాంక్ష) : డెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం రామ్ నగర్ బస్తి వాసుల కోసం ఉచిత మెడికల్ క్యాంప్ విజయవంతంగా నిర్వహించబడింది. ఈ క్యాంప్‌లో స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య సేవలను పొందారు.ఈ కార్యక్రమానికి జి.మాధవి నేతృత్వం వహించారు.ఈ కార్యక్రమంలో సాధారణ వైద్య పరీక్షలతో పాటు దంత (డెంటల్) పరీక్షలు మరియు కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వైద్య సలహాలు మరియు ఉచిత మందులు అందించారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా ఇలాంటి ఉచిత మెడికల్ క్యాంపులను డెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ వివిధ ప్రాంతాల్లో నిరంతరం నిర్వహిస్తుందని నిర్వాహకులు తెలిపారు.ఈ క్యాంప్ నిర్వహణలో సహకరించిన వైద్య బృందం, వాలంటీర్లు మరియు పాల్గొన్న ప్రజలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన ఎల్లారెడ్డిపేట సీఐ వెంకటేష్...

రాజన్న సిరిసిల్ల//మార్చి 11 (ఆకాంక్ష) : ఎల్లారెడ్డిపేట సర్కిల్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఓ. వెంకటేష్ బుధవారం రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. వేములవాడలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయనను కలిసి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నూతన సీఐ వెంకటేష్‌కు అభినందనలు తెలియజేశారు. ఎల్లారెడ్డిపేట సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణలో సమర్థంగా పనిచేయాలని సూచించారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేస్తూ ప్రజల్లో భద్రతా భావం కల్పించాలని కోరారు.పోలీస్ శాఖపై ప్రజలకు విశ్వాసం పెరగాలంటే అధికారులు నిబద్ధతతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా సీఐ వెంకటేష్ మాట్లాడుతూ, ఎల్లారెడ్డిపేట సర్కిల్ పరిధిలో శాంతి భద్రతలను కాపాడటంతో పాటు నేర నియంత్రణకు కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## మార్నింగ్ క్రికెటర్స్ అధ్యక్షుడిగా లింగం నారాయణ ఏకగ్రీవ ఎన్నిక...



మంథని//మార్చి 11 (ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని కాలేజ్ గ్రౌండ్‌లో బుధవారం ఉదయం మార్నింగ్ క్రికెటర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సంఘం కొత్త కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మార్నింగ్ క్రికెటర్స్ అధ్యక్షుడిగా లింగం నారాయణను క్రీడాకారులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. క్రీడల అభివృద్ధికి మరియు యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడానికి తాను కృషి చేస్తానని ఈ సందర్భంగా లింగం నారాయణ తెలిపారు.ఈ సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడిగా రాజేందర్‌ను, కోశాధికారిగా ఆర్కే యాదవ్‌ను ఎంపిక చేశారు. సలహాదారుడిగా డాక్టర్ రాజేంద్రప్రసాద్‌ను, ఉప సలహాదారుడిగా ఆకుల అజయ్‌ను ఎన్నుకున్నారు. మార్నింగ్ క్రికెటర్స్ వీడియో గ్రాఫర్‌గా రాజును నియమించారు.ఈ సందర్భంగా మాట్లాడిన క్రీడాకారులు కొత్త కమిటీ సమన్వయంతో మంథని పట్టణంలో క్రికెట్ క్రీడను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. యువతను క్రీడల వైపు ఆకర్షించేలా మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో మార్నింగ్ క్రికెటర్స్ సభ్యులతో పాటు ఉదయం వాకింగ్‌కు వచ్చే వాకర్స్ కూడా పాల్గొని కొత్త కమిటీకి అభినందనలు తెలిపారు.

# రాష్ట్రంలో ఫీజుల రియంబర్స్మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలి...

ఫీజుల రియంబర్స్మెంట్ పథకాన్ని నీరుగారిస్తే ప్రభుత్వ పీఠాలు కదిలిస్తా...

ఫీజుల కోసం ఈనెల 15న పోరు దీక్ష పోస్టర్ ఆవిష్కరించిన జాజుల శ్రీనివాస్ గౌడ్...

కాంట్రాక్టర్లకు 70 వేల కోట్లు ఇచ్చి, ఫీజుల కోసం ఏడు వేల కోట్లు ఇవ్వరా

ప్రభుత్వాన్ని నిలదీసిన బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి...



హైదరాబాద్//మార్చి 11 (ఆకాంక్ష) : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల పరిపాలనలో ఎవరెవరికి ఎంత నిధులు ఖర్చు చేశారు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే శ్వేత పత్రం విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం బషీర్ భాగ్ ప్రెస్ క్లబ్ లో బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఫీజుల రియంబర్స్మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని, ఈ బడ్జెట్ లో ఫీజులకు పదివేల కోట్లు కేటాయించాలని డిమాండ్ తో ఈనెల 15వ తేదీన హైదరాబాద్ లోని ఇందిరాపార్క్ వద్ద చేపట్టనున్న ఫీజు పోరు దీక్ష వాల్ పోస్టర్ ను బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గౌడుగు మహేష్ యాదవ్, జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రం గౌడ్ లతో కలిసి జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తాము అధికారంలోకి రాగానే ఫీజులకు బకాయిలను విడుదల చేస్తామని, బీసీ విద్యార్థుల పూర్తి ఫీజులను చెల్లిస్తామని, ఐదు లక్షల రూపాయలతో ప్రతి విద్యార్థికి విద్యార్థి భరోసా కార్డులను అందజేస్తామని నమ్మ బలికిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచిన నేటి వరకు అమలు చేయకపోవడం చాలా దురదృష్టకరమన్నారు.గత రెండు సంవత్సరాల కాలంలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న పేద విద్యార్థులకు ఫీజుల రియంబర్స్మెంట్ బకాయిలను చెల్లించాలని రాష్ట్రమంతా విద్యార్థులంతా ఉద్యమిస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం ఖజానా ఖాళీ ఉందని అబద్ధపు మాటలు చెబుతుందన్నారు, ఏడు వేల కోట్లు ఫీజుల బకాయిలు ఇవ్వలేని ప్రభుత్వం గత రెండు సంవత్సరాలుగా బడా కాంట్రాక్టర్లకు 70 వేల కోట్ల రూపాయలను ఎలా ఇచ్చిందని ఆయన ప్రశ్నించారు. గత రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో 3 లక్షల కోట్ల అప్పు చేశారని, తెలంగాణలోని ప్రతి మనిషికి 1,76 వేల రూపాయలు అప్పు రుద్దారని, అప్పు బడుగులపై రుద్ది, సంపద మాత్రం బడా కాంట్రాక్టర్లకు పంచుతున్నారని ఆయన మండిపడ్డారుఫీజులు ఇవ్వలేని ప్రభుత్వం ఇంకొక వైపు 5 వేల కోట్ల తో గాంధీ విగ్రహం పెడుతున్నారని, 22 లక్షల పేద విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెట్టి గాంధీ విగ్రహం ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి మాట్లాడుతూ ఫీజుల రియంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలని ఒకవైపు విద్యార్థి లోకమంతా డిమాండ్ చేస్తూ ఉంటే, కాలేజీ అమ్మాయిలకు ఈ స్కూటీలను ఇస్తామని, కళాశాల విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనం పెడతామని సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడడం చాలా దారుణం అన్నారు విద్యార్థులకు కావాల్సింది స్కూటీలు ఎంగిలి మెతుకులు కాదని, ఆత్మగౌరవంతో చదువుకోవడానికి ఫీజుల రియంబర్స్మెంట్ లు కావాలని ఆయన డిమాండ్ చేశారు.ఫీజుల రియంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడం వలన ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్రంలో 22 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని, నాడు కాసోజు శ్రీకాంతాచారి నుండి మొదలుకొని సిరిపురం యాదయ్య వరకు విద్యార్థి అమరులు బలిదానం చేస్తే తెలంగాణ రాష్ట్రం వచ్చిందని, వచ్చిన తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం ఫీజులు ఇవ్వకుండా విద్యార్థులను హరిగోస పెడుతుందని, మళ్లీ విద్యార్థుల చావులకు కారణం అవుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్, బీసీ మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తారకేశ్వరి, ఉపాధ్యక్షురాలు సంధ్యారాణి, గూడూరు భాస్కర్ మేరు, సత్యం గౌడ్, ఇంద్రమ్ రజక, అనంతుల పవన్ సాయి కుమార్, బండి గారి రాజు, అనంతొజు బ్రహ్మాచారి, గోద రవీందర్ రేణుక, విజయలక్ష్మి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు



## మహిళా వికలాంగుల కోసం ప్రత్యేక కార్యక్రమం 14న నిర్వహణ...

ఓదెల//మార్చి 11 (ఆకాంక్ష) : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా వికలాంగుల కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని ఈ నెల 14వ తేదీన నిర్వహించనున్నట్లు క్యాడర్ ఎన్‌జీఓ సంస్థ కార్యదర్శి గజ్జెల్లి సతీష్ తెలిపారు. పెద్దపల్లి పట్టణంలోని ఆర్ ఆర్ గార్డెన్ సమీపంలో ఉన్న సీజెఎంఆర్ బ్యాంకెట్ హాల్, రంగంపల్లి వద్ద ఈ కార్యక్రమం జరుగుతుందని ఆయన వెల్లడించారు.ఈ కార్యక్రమం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. మహిళా వికలాంగుల సామాజిక, ఆర్థిక సాధికారత లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాల్గొనే మహిళా వికలాంగులకు న్యాయ సలహాలు, ప్లేస్మెంట్ సెల్ ద్వారా ఉద్యోగ అవకాశాలపై మార్గదర్శకత్వం, స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే వివాహ సంబంధాల పరిచయ వేదికను కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.పెద్దపల్లి జిల్లాలోని మహిళా వికలాంగులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గజ్జెల్లి సతీష్ కోరారు. కార్యక్రమానికి సంబంధించి మరిన్ని వివరాల కోసం క్యాడర్ ఎన్‌జీఓ కార్యదర్శి గజ్జెల్లి సతీష్ (9441136828) ను సంప్రదించాలని సూచించారు.

## హోం గార్డ్ మహేందర్ తొలి వర్ధంతి సందర్భంగా దుప్పట్ల పంపిణీ...



మెదక్//మార్చి 11 (ఆకాంక్ష) : మెదక్ జిల్లా పాపన్నపేట మండలం నాగ్సాన్పల్లి గ్రామానికి చెందిన హోం గార్డ్ నాగ్సాన్పల్లి మహేందర్ తొలి వర్ధంతి సందర్భంగా బుధవారం గ్రామంలో దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గత సంవత్సరం మార్చి 11న మహేందర్ అకస్మాత్తుగా మరణించిన విషయం తెలిసిందే. ఆయన స్మృతిని పురస్కరించుకుని కుటుంబ సభ్యులు గ్రామ ప్రజలకు దుప్పట్లను అందజేశారు.గ్రామంలో చిన్న పెద్ద తేడా లేకుండా అందరితో కలిసిమెలిసి ఉండే వ్యక్తిగా మహేందర్ పేరు గాంచినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ఆయన సేవలను స్మరించుకుంటూ కుటుంబ సభ్యులు ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. మహేందర్ భార్య భాగ్యలక్ష్మి, ఇద్దరు కుమారుల చేతుల మీదుగా గ్రామ ప్రజలకు దుప్పట్లను పంపిణీ చేశారు. అనంతరం గ్రామస్తులకు భోజన ఏర్పాట్లు కూడా చేశారు.ఈ కార్యక్రమంలో మహేందర్ తల్లి స్వరూప, తమ్ముడు సిద్దేందర్, పోలబోయిన రాము, టేక్మాల్ బామ్మర్దులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేందర్ తమ్ముడు సిద్దేందర్ మాట్లాడుతూ, అన్నయ్య మరణించి సంవత్సరం గడిచినా ఆయన లేని లోటు ఇంకా తమకు స్పష్టంగా అనిపిస్తోందని భావోద్వేగానికి గురయ్యారు. మహేందర్ చేసిన సేవలను గ్రామ ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరని ఆయన తెలిపారు.



## విద్యార్థుల హైజిన్‌పై ప్రధానోపాధ్యాయులకు శిక్షణ...




నాగర్ కర్నూల్ టౌన్//మార్చి 11 (ఆకాంక్ష) : నాగర్ కర్నూల్ జిల్లాలోని బిజినపల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు విద్యార్థుల పరిశుభ్రతపై అవగాహన కల్పించే లక్ష్యంతో బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బిజినపల్లి జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో అపోలో ఫౌండేషన్ ప్రతినిధులు ఎన్. రఘువరన్, డి. చరణ్, కె. కృష్ణ డెట్టాల్ స్కూల్ హైజీన్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ గురించి వివరించారు. శిక్షణ అనంతరం ప్రతి పాఠశాలలో విద్యార్థులకు పరిశుభ్రత అలవాట్లు పెంపొందించేందుకు చేతులు కడుక్కోవడం, పారిశుధ్యం వంటి అంశాలపై ఇంటరాక్టివ్ టూల్స్, ఎస్‌టీఈఎం ఆధారిత కిట్లు మరియు "హైజీన్ కార్నర్స్" ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి...

ఎన్ఎస్ఎస్ చైర్మన్ డా. పి. రాములు..



నాగర్ కర్నూల్ టౌన్//మార్చి 11 (ఆకాంక్ష) : డ్రగ్స్ వంటి చెడు అలవాట్లను తరిమి వేయడంతో పాటు పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని పాలెం శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్, ఎన్ఎస్ఎస్ చైర్మన్ డాక్టర్ పి. రాములు పేర్కొన్నారు. బిజినపల్లి మండలంలోని వట్టెం గ్రామంలో బుధవారం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు డ్రగ్స్ వినియోగం నివారణ, పర్యావరణ పరిరక్షణపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. పాలెం శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ స్వయంప్రతిపత్తి కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో భాగంగా ఈ ర్యాలీ చేపట్టారు. గత ఐదు రోజులుగా వట్టెం గ్రామంలో పరిశుభ్రత, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు "మత్తు కోసం బ్రతకకు లక్ష్యం కోసం బ్రతుకు", "డ్రగ్స్‌ను తరిమేద్దాం యువతను కాపాడుదాం", "ప్లాస్టిక్ వాడకు ప్రాణాలు తీయకు", "ప్రతి చుక్క విలువైనది నీటిని వృథా చేయకండి" వంటి నినాదాలతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పి. జ్యోతి శంకర్, ఉపసర్పంచ్ వి. వినీత్ గౌడ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డా. నాగరాజు, శివ దొడ్ల, అధ్యాపకులు మనోజ్ కుమార్, యాదగిరి, గ్రామ వార్డు సభ్యులు, యువకులు మరియు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.




## రామాయణం పోటీ పరీక్షల విజేతలకు బహుమతులు ప్రదానం...



మంథని//మార్చి 11 (ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలో విశ్వహిందూ పరిషత్ మంథని ప్రఖండ ఆధ్వర్యంలో నిర్వహించిన రామాయణం పోటీ పరీక్షల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మంథని పట్టణంలోని శ్రీ కన్యకాపరమేశ్వరి దేవాలయ ఫంక్షన్ హాల్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ పోటీ పరీక్షల్లో మంథని పట్టణంలోని ఐదు పాఠశాలల నుండి సుమారు 55 మంది విద్యార్థులు పాల్గొన్నారు.ఈసందర్భంగా విశ్వహిందూ పరిషత్ మంథని ప్రఖండ బాధ్యులు రావుల సతీష్ మాట్లాడుతూ సోమవారం రోజున మంథనిలోని ఐదు పాఠశాలల్లో మొత్తం 350 మంది విద్యార్థులకు రామాయణం అంశంపై ప్రాథమిక పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి పాఠశాల నుండి మూడు విభాగాలుగా ఎంపిక చేసి మొత్తం 55 మంది విద్యార్థులను తుది పోటీకి ఎంపిక చేసి, బుధవారం వారికి ఫైనల్ పోటీ పరీక్షలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసినట్లు వివరించారు. విద్యార్థుల్లో ధార్మిక విలువలు, భారతీయ సంస్కృతి, ఇతిహాసాలపై అవగాహన పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.పోటీ ఫలితాల్లో 8, 9, 10 తరగతుల విభాగంలో కాకతీయ హై స్కూల్‌కు చెందిన దుద్దిళ్ల హాసిని మొదటి బహుమతి సాధించగా, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మంథనికి చెందిన నామిని సహర్షిణి ద్వితీయ బహుమతి, కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌కు చెందిన కుదుదుల హాసిని తృతీయ బహుమతి సాధించారు.6, 7 తరగతుల విభాగంలో కాకతీయ హై స్కూల్‌కు చెందిన గిట్ల శ్రీనిత్య రెడ్డి మొదటి బహుమతి, అదే పాఠశాలకు చెందిన కందునూరి సాయి సాన్విత ద్వితీయ బహుమతి, అలోక్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన ఓల్లాల సాయి తృతీయ బహుమతి సాధించారు.3, 4, 5 తరగతుల విభాగంలో కాకతీయ హై స్కూల్‌కు చెందిన గిట్ల శ్రీవిద్య మొదటి బహుమతి, అలోక్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన మేకల వైష్ణవి ద్వితీయ బహుమతి, కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌కు చెందిన మిరాల సోనిత్ తృతీయ బహుమతి సాధించారు. మొత్తం మూడు విభాగాల్లో తొమ్మిది మంది విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులు కొత్త శ్రీనివాస్ గుప్తా, మంథని ప్రఖండ బాధ్యులు రావుల సతీష్, ప్రధాన కార్యదర్శి వడ్లకొండ శ్రావణ్, సత్సంగ్ ప్రముఖ్ కొమురవెల్లి హరీష్ గుప్తా, సహ కార్యదర్శి గుండా శ్రీనివాస్,ధర్మజాగరణ ప్రముఖ్ కనుకుంట్ల స్వామి, ఉపాధ్యక్షులు మెడగొని రాజమౌళి గౌడ్, ప్రచార ప్రముఖ్ తూర్పాటి రాము, శిశుమందిర్ కార్యదర్శి మాడిశెట్టి సురేందర్, కెక్కెర్ల అనిల్ కుమార్, మాతృశక్తి సంయోజక రావికంటి రేణుక, సహ సంయోజక కొత్త పుష్పలతతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు భరత్ రెడ్డి, మాధవి, లావణ్య, రమాదేవి, రాజమల్లు ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

## ఐతోల్ గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి...

మాజీ మంత్రి డా. సి. లక్ష్మారెడ్డి...



నాగర్‌కర్నూల్ టౌన్//మార్చి 11 (ఆకాంక్ష) : నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలంలోని ఐతోల్ గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా కృషి చేస్తామని మాజీ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డి తెలిపారు. బుధవారం ఐతోల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.పాఠశాల విద్యార్థుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని కొత్త భోజనశాల మరియు సమావేశ మందిరాన్ని సుమారు రూ.8 లక్షల వ్యయంతో నిర్మించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఐతోల్ గ్రామానికి చెందిన నాగర్‌కర్నూల్ రాఘవేంద్ర హాస్పిటల్ వ్యవస్థాపకురాలు డాక్టర్ రాధిక లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఈ భవన నిర్మాణం చేపట్టబడుతోంది. ఆమె తండ్రి కీవశేవ సత్తవరం శ్రీనివాస్ రెడ్డి జ్ఞాపకార్థంగా పాఠశాలకు ఈ భవనాన్ని అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు.పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న భోజనశాల, సమావేశ మందిరం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సంధ్య, ఉపసర్పంచ్ లక్ష్మీ పాల్గొన్నారు. గ్రామ పూజారి హరికృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పెద్దలు నర్సింహారెడ్డి, లక్ష్మయ్య, రాంరెడ్డి, తిరుపతిరెడ్డి, రాంకిషన్, అఖిల్, శివాజీ తదితరులు హాజరయ్యారు.పాఠశాల అభివృద్ధికి సహకరించిన డాక్టర్ రాధిక లక్ష్మారెడ్డి కుటుంబానికి గ్రామస్థులు మరియు పాఠశాల నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతాభివందనాలు తెలిపారు.



## ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మాధవరావు...



గోదావరిఖనిటౌన్//మార్చి 11 (ఆకాంక్ష) : నేత్రదానం మహా పుణ్యకార్యమని గోదావరిఖని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు డి. మాధవరావు, సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి లింగమూర్తి అన్నారు. ఎన్టీపీసీ కృష్ణానగర్‌కు చెందిన సీనియర్ జర్నలిస్ట్ జక్కం మారుతి సతీమణి జక్కం ప్రేమలత ఈ నెల 1న అకాల మరణం చెందగా, బుధవారం సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆమె సంస్మరణ సభ నిర్వహించారు.ఈ సందర్భంగా నేత్రదాత ప్రేమలతకు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ తీవ్ర విషాద సమయంలో కూడా ప్రేమలత నేత్రాలను దానం చేసి ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించిన కుటుంబ సభ్యులు సమాజానికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. నేత్రదానం ద్వారా ఇతరుల జీవితాల్లో వెలుగు నింపడం గొప్ప సేవ అని పేర్కొన్నారు.ప్రేమలత భర్త జక్కం మారుతి, కుమారులు సతీష్‌సరిత, సురేష్‌సంతోషి కుటుంబ సభ్యులను అభినందించారు. అనంతరం సదాశయ ఫౌండేషన్ తరఫున వారికి అభినందన పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా జర్నలిస్టు సంఘం ఎథిక్స్ కమిటీ కో-కన్వీనర్ పందిళ్ల శ్యామ్, సుందర్, సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రచార కార్యదర్శి కె.ఎస్. వాసు, ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షుడు పూదరి కుమార్, సీనియర్ జర్నలిస్టులు జక్కం సత్యనారాయణ, రామ్ శంకర్, అఖిలగాండ్ల రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి కూతురు లక్ష్మణ్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు వెంకట్రాజం, ప్రతినిధులు నూడిగొండ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## నగర సమస్యల పరిష్కారానికి రూ.3.36 కోట్లు మంజూరు చేయాలి...

### జిల్లా కలెక్టర్‌ను కోరిన రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి...




గోదావరిఖనిటౌన్ //**మార్చి 11 (ఆకాంక్ష) :** నగరంలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధిదీపాల సమస్యలను పరిష్కరించేందుకు అత్యవసరంగా రూ.3.36 కోట్ల నిధులు మంజూరు చేయాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి జిల్లా కలెక్టర్‌ను కోరారు. పెద్దపల్లి పట్టణంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన “ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక”పై జిల్లాలోని మున్సిపాలిటీల ప్రజాప్రతినిధులకు నిర్వహించిన ఓరియెంటేషన్ సమావేశంలో ఆయన ఈ విషయాన్ని ప్రస్తావించారు. ఈ సందర్భంగా మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ రాబోయే వేసవికాలంలో తాగునీటి కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. దీనిలో భాగంగా బోర్‌బావుల మరమ్మత్తులు, కొత్త బోర్‌బావులు తవ్వడం, లీకేజీల మరమ్మత్తులు, విలీన గ్రామాలతో పాటు నీటి సరఫరా లేని ప్రాంతాలకు పైప్‌లైన్లు వేయడం వంటి పనులకు సుమారు ఒక కోటి రూపాయలు అవసరమవుతాయని తెలిపారు. అదేవిధంగా నగరంలో వీధిదీపాల నిర్వహణ, విడిభాగాల కొనుగోలు, కొత్త వీధిదీపాల ఏర్పాటు, ప్రధాన కూడళ్లలో మినీ హైమాస్ట్ లైట్లు ఏర్పాటు వంటి పనులకు ఒక కోటి ముప్పై ఆరు లక్షల రూపాయలు ఖర్చవుతాయని అంచనా వేశామని చెప్పారు. నగర పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చేందుకు పారిశుద్ధ్య వాహనాల మరమ్మత్తులు, బ్లీచింగ్, సున్నం వంటి పనులకు మరో కోటి రూపాయలు అవసరమవుతాయని పేర్కొన్నారు. నగర పాలక సంస్థ ఖజానాలో నిధుల కొరత ఉన్న నేపథ్యంలో సి.ఎస్.ఆర్, డి.ఎం.ఎఫ్.టి లేదా ఇతర అందుబాటులో ఉన్న నిధుల నుంచి అత్యవసరంగా రూ.3.36 కోట్లను మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. ఈ మేరకు అంచనాలతో కూడిన ప్రతిపాదనలను కూడా సమర్పించినట్లు వెల్లడించారు. ఈ సమావేశానికి రామగుండం శాసన సభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్, డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, కార్పొరేటర్లు, నగర పాలక సంస్థ అధికారులు తదితరులు హాజరయ్యారు.

## బొగ్గు నాణ్యత ప్రమాణాల పని విధానంపై అధికారుల సమీక్ష..




గోదావరిఖని//**మార్చి 11 (ఆకాంక్ష) :** సింగరేణి సంస్థలో బొగ్గు నాణ్యతను మరింత మెరుగుపరచే దిశగా థర్డ్ పార్టీ శాంప్లింగ్ సంస్థల పని విధానం, నమూనా సేకరణ ప్రక్రియపై రామగుండం మరియు బెల్లంపల్లి రీజియన్ స్థాయి అధికారుల సమీక్షా సమావేశం బుధవారం గోదావరిఖని ఆర్జీ1 జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశానికి రామగుండం రీజియన్ క్వాలిటీ జనరల్ మేనేజర్ డాక్టర్ సుజోయ్ మజుందార్ అధ్యక్షత వహించగా, బెల్లంపల్లి రీజియన్ జీఎం వీరభద్రరావు సమీక్ష నిర్వహించారు. సింగరేణి సంస్థలో బొగ్గు నాణ్యతను పెంపొందించేందుకు థర్డ్ పార్టీ సంస్థలు పాటిస్తున్న విధానాలు, శాంప్లింగ్ సేకరణలో అనుసరిస్తున్న ప్రమాణాలు, విధివిధానాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. మొదట ఏరియాల వారీగా వివిధ థర్డ్ పార్టీ కంపెనీల పని తీరును సమీక్షిస్తూ సేకరించిన నమూనాల వివరాలను అధికారులు పరిశీలించారు. శాంప్లింగ్ ప్రక్రియలో పాటించాల్సిన నాణ్యత ప్రమాణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అవసరమైన మార్పులపై సూచనలు ఇచ్చారు. సమీక్షలో వచ్చిన అంశాలను కార్పొరేట్ స్థాయికి నివేదించాలని కూడా నిర్ణయించారు. బొగ్గు నాణ్యతను కాపాడటంతో పాటు కార్మికుల భద్రతకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులు సూచించారు. థర్డ్ పార్టీ ఏజెన్సీల కార్మికులకు జీతభత్యాలు బ్యాంకుల ద్వారా సమయానికి చెల్లిస్తున్నారా అనే విషయాన్ని కూడా అడిగి తెలుసుకున్నారు. సంస్థలు నియమ నిబంధనలు పాటిస్తూ పారదర్శకంగా పని చేయాలని సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రామగుండం మరియు బెల్లంపల్లి రీజియన్లకు చెందిన అన్ని ఏరియాల క్వాలిటీ మేనేజర్లు, అనలిటికల్ ల్యాబ్ ఇంచార్జ్‌లు, ఐజీఐ, కోటక్నా, క్యూ ఎస్ ఎస్, క్యూ ఏ సి ఏ, క్యూ సి ఐ సంస్థల అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. బొగ్గు నాణ్యతతో పాటు భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ విధులు నిర్వహిస్తామని సమావేశంలో పాల్గొన్న అధికారులు తెలిపారు.

## విద్యార్థులు యాంటీ డ్రగ్ సోల్జర్స్‌గా మారాలి...

### సెక్టోరియల్ ఆఫీసర్ వెంకటయ్య..



నాగర్ కర్నూల్//**మార్చి 11 (ఆకాంక్ష) :** డ్రగ్స్ మహమ్మారిని అరికట్టడంలో విద్యార్థులు యాంటీ డ్రగ్ సోల్జర్స్‌గా మారి సమాజంలో అవగాహన పెంపొందించడంలో కీలక పాత్ర పోషించాలని సెక్టోరియల్ ఆఫీసర్ వెంకటయ్య సూచించారు. బుధవారం నాగర్ కర్నూల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ మరియు టీజీ ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో ప్రహరీ క్లబ్ సభ్యులైన విద్యార్థులు, గైడ్ టీచర్లకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లాలో గుర్తించిన 20 మండలాల నుండి ఎంపిక చేసిన 20 పాఠశాలలకు చెందిన ప్రహరీ క్లబ్ సభ్యులైన ఏడవ తరగతి మరియు తొమ్మిదవ తరగతి విద్యార్థులు, ప్రహరీ క్లబ్ ఇన్‌చార్జ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సెక్టోరియల్ ఆఫీసర్ వెంకటయ్య మాట్లాడుతూ, ఇక్కడ శిక్షణ పొందిన విద్యార్థులు కాంప్లెక్స్ స్థాయిలో ఇతర విద్యార్థులకు డ్రగ్స్ ప్రమాదాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత తీసుకోవాలని సూచించారు. సమాజాన్ని డ్రగ్స్ రహితంగా మార్చడంలో విద్యార్థుల భాగస్వామ్యం ఎంతో అవసరమని ఆయన అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ కార్యాలయం నుండి సిఐ శంకర్ నాయక్ మాట్లాడుతూ పాఠశాలల్లో ప్రహరీ క్లబ్ల ఏర్పాటు ద్వారా విద్యార్థుల్లో సామాజిక బాధ్యత పెంపొందించడంతో పాటు డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే



దుష్పరిణామాలపై అవగాహన కల్పించడం ముఖ్యమని తెలిపారు. విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండి ఇతరులను కూడా అప్రమత్తం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లుగా తిరుపతయ్య, లక్ష్మీ ప్రసన్న వ్యవహరించారు. పోలీస్ శాఖ నుండి నార్కోటిక్ కానిస్టేబుల్ వీరయ్య, తాడూరు ఎంఈఓ త్యాగరాజు, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లత పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు డ్రగ్స్ ప్రమాదాలు, వాటి నివారణ చర్యలు, సమాజంలో అవగాహన కల్పించే విధానాలపై వివరంగా శిక్షణ అందించారు.

## రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులకు పండ్ల పంపిణీ...



జడ్చర్ల//**మార్చి 11 (ఆకాంక్ష) :** మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం వల్లూరు గ్రామంలో రంజాన్ నెల సందర్భంగా ముస్లిం సోదరులకు పండ్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గౌరవ మాజీ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ తరపున ఈ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. రంజాన్ పవిత్ర నెలను పురస్కరించుకొని 2004 సంవత్సరం నుండి ప్రతి ఏడాది క్రమం తప్పకుండా ప్రతి మసీదు వద్ద ముస్లిం సోదరులకు పండ్లు పంపిణీ చేస్తూ వస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ పరంపరలో భాగంగా ఈ ఏడాది కూడా వల్లూరు గ్రామంలోని ముస్లిం సోదరులకు పండ్లు అందజేసి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జడ్చర్ల మండల బిఆర్ఎస్ పార్టీ యూత్ వింగ్ అధ్యక్షులు వల్లూరు వీరేష్ మాట్లాడుతూ భారతదేశం బిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలిచిన దేశమని పేర్కొన్నారు. హిందూముస్లిం ఐక్యతతో సమాజం ముందుకు సాగాలని, అన్ని వర్గాల ప్రజలు సోదరభావంతో జీవించాలని పిలుపునిచ్చారు. హిందూ ముస్లిం బాయి బాయి అనే భావనతో పరస్పర గౌరవంతో కలిసి జీవించడం సమాజానికి మంచిదని అన్నారు. ఈ కార్యక్రమంలో మసీదు ఇమాం జహంగీర్, గౌరవ అధ్యక్షులు రషీద్, అధ్యక్షులు ఇంతియాజ్, గ్రామ పెద్దలు అహ్మద్, బాబుజాని, మహమూద్, నల్లాల పాషా, సలాం, గౌస్, ఖాజా పాషా పాల్గొన్నారు. అదేవిధంగా వార్డు సభ్యులు షేరు, రూప్‌సింగ్ నవాబ్, చాన్ పాషా, నిరంజన్, ఖాదర్, జబీ, ఖలీల్, సోహేల్ అర్మాన్, షఫీ, శంకర్, బిక్షపతి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. రంజాన్ పవిత్ర నెలలో పరస్పర సౌహార్దాన్ని పెంపొందించే ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని స్థానికులు అభిప్రాయపడ్డారు.

## మార్చి 16న కలెక్టరేట్ వద్ద మహాధర్నా...

### జయప్రదం చేయాలని ఐఎఫ్టియు రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ పిలుపు...




గోదావరిఖని//**మార్చి 11 (ఆకాంక్ష) :** కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న కార్మిక వ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా మార్చి 16న జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న మహాధర్నాను కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్టియు) రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం గోదావరిఖనిలోని యూనియన్ కార్యాలయంలో ఐఎఫ్టియు జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రస్తుతం అమలులో ఉన్న 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చి కార్మికులను బానిసలుగా మార్చే ప్రయత్నం చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్న ఈ లేబర్ కోడ్స్ కార్మిక వర్గానికి ఉరితాళ్లుగా మారే ప్రమాదం ఉందని అన్నారు. దేశ కార్మిక వర్గానికి మరణ శాసనాలుగా మారే ఈ నాలుగు లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని కేంద్ర బీజేపీ ప్రభుత్వాన్ని భారత కార్మిక సంఘాల సమాఖ్య డిమాండ్ చేస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా ఈ లేబర్ కోడ్స్ అమలును నిలిపివేయాలని, గతంలో రూపొందించిన రూల్స్‌ను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం ఆమోదించి కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖకు పంపాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్స్‌లో కార్మికుల వేతనాలు, పని పరిస్థితులు, జీవన ప్రమాణాలు మెరుగుపడే అంశాలు ఏమాత్రం కనిపించడం లేదని విమర్శించారు. కార్మికుడు, కార్మిక సంఘాల నిర్వచనాలను పూర్తిగా మార్చే విధంగా ఈ కోడ్స్ రూపొందించబడినట్లు తెలిపారు. వేతనాల విషయంలో యాజమాన్యాలకే పూర్తి బాధ్యత ఇస్తూ, వివాదాస్పద అంశాలపై తుది నిర్ణయం కేంద్ర ప్రభుత్వానిదేనని పేర్కొనడం ద్వారా కార్మిక హక్కులను పూర్తిగా దెబ్బతీసే ప్రయత్నం జరుగుతోందని అన్నారు. కార్మిక చట్టాల భౌతిక ఉనికిని ధ్వంసం చేస్తూ కార్మిక వర్గం మౌలిక హక్కులను హరించే ఈ నాలుగు లేబర్ కోడ్స్ రద్దు కోసం సమరశీల కార్మిక పోరాటాలను కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఐఎఫ్టియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మార్చి 16న జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న మహాధర్నాను కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఐఎఫ్టియు రాష్ట్ర సహాయక కార్యదర్శి ఏ వెంకన్న, జిల్లా అధ్యక్షుడు ఈ నరేష్, జిల్లా కార్యదర్శి బి అశోక్, జిల్లా ఉపాధ్యక్షుడు చిలుక శంకర్, నాయకులు ఎస్ ప్రసాద్, బొట్టు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి...

### ఏప్రిల్ 2026 మధ్య గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం...




నాగర్ కర్నూల్//**మార్చి 11 (ఆకాంక్ష) :** నాగర్ కర్నూల్ జిల్లాలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పనులను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 20 నుండి 26 వరకు నిర్వహించనున్న సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా జిల్లాలో చివరి దశలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పూర్తి చేసి గృహ ప్రవేశాలు జరిగేలా చూడాలని సూచించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ జీవి శ్యామ్ ప్రసాద్ లాల్, జిల్లా పరిషత్ సీఈవో దేవ సహాయం లతో కలిసి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, గృహ నిర్మాణ శాఖ ఏఈలతో కలెక్టర్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై అధికారులు సమగ్రంగా వివరాలు సమర్పించారు. జిల్లాలో మొత్తం 10,383 ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులకు మంజూరు చేయగా ఇప్పటి వరకు 7,735 ఇండ్లు గ్రౌండింగ్ పూర్తి అయ్యాయని, ఇంకా 2,648 ఇండ్ల నిర్మాణ పనులు ఎందుకు ప్రారంభం కాలేదని కలెక్టర్ అధికారులను ప్రశ్నించారు. నిర్మాణ పనులు ప్రారంభం కాని మండలాలను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలాల వారీగా కేటాయించిన లక్ష్యాలు, లబ్ధిదారుల నిర్ధారణ, మంజూరైన ఇండ్లలో ఎన్ని నిర్మాణాలు ప్రారంభమయ్యాయి, అవి ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించి లక్ష్య సాధన కోసం అంకితభావంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. ప్రత్యేకంగా ఎంపీడీవోలు క్షేత్రస్థాయిలో లబ్ధిదారులను నేరుగా కలిసి ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించేలా ప్రోత్సహించాలని, ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ ప్రక్రియను నిశితంగా పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇళ్ల నిర్మాణానికి నిధుల కొరత లేదని, నిర్మాణ పనులు చేపడుతున్న లబ్ధిదారులకు దశల వారీగా నిధులు వారి ఖాతాల్లో జమ అవుతున్నాయని స్పష్టం చేశారు. బేస్మెంట్ స్థాయి వరకు నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేసుకునేలా అధికారులు చొరవ చూపాలని, లబ్ధిదారులు పునాది వేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలాగే మున్సిపాలిటీల్లో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పురోగతిపై కూడా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న పనులను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ సంగప్ప, డీపీఓ శ్రీరాములు, డిప్యూటీ సీఈవో గోపాల్ నాయక్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## మడ్డి ఎల్లయ్య ప్రజాస్వామ్య వైఖరికి నిరసనగా అర్జీ -1 ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి రాజీనామా....






గోదావరిఖని//**మార్చి 11 (ఆకాంక్ష) :** సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్‌లో కొనసాగుతున్న ఏకపక్ష ధోరణి, ప్రజాస్వామ్య విరుద్ధ వైఖరికి నిరసనగా అర్జీ -1 డివిజన్ కార్యదర్శి ఆరెల్లి పోశం తన పదవికి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. యూనియన్‌లో నాయకత్వం వహిస్తున్న మడ్డి ఎల్లయ్య తీరును వ్యతిరేకిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను యూనియన్ ప్రధాన కార్యదర్శి కూరిమి రాజ్‌కుమార్‌కు పంపించినట్లు పోశం వెల్లడించారు. యూనియన్‌లో ఆర్థిక పారదర్శకత లేకపోవడం, సభ్యత్వ రుసుముల రూపంలో లక్షల రూపాయలు వసూలు అవుతున్నప్పటికీ వాటి లెక్కలు సభ్యులకు తెలియజేయకపోవడం వంటి అంశాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. భాస్కర్‌రావు భవన్ నుంచి వచ్చే అద్దె ఆదాయం, వివిధ విరాళాలు, ఇతర ఆర్థిక వనరులపై సరైన లెక్కలు లేకపోవడంతో పాటు ఎలాంటి ఆడిటింగ్ కూడా నిర్వహించడం లేదని ఆరోపించారు. ఈ విషయాలపై ప్రశ్నించే వారిపై అణచివేత ధోరణి ప్రదర్శిస్తున్నారని, యూనియన్‌లో ప్రజాస్వామ్య పద్ధతులు పూర్తిగా దెబ్బతిన్నాయని విమర్శించారు. ఒక బ్రాంచ్ కార్యదర్శికి లెటర్‌ప్యాడ్ ఇవ్వవద్దని యూనియన్ ప్రధాన కార్యదర్శి కార్యాలయ సిబ్బందికి చెప్పడం, జీఎం కార్యాలయంలో ప్రతినిధులు సమస్యలు ప్రస్తావించకుండా అధికారులకు సూచనలు ఇవ్వడం వంటి చర్యలు యూనియన్‌లో నియంతృత్వ ధోరణిని ప్రతిబింబిస్తున్నాయని పోశం అన్నారు. యూనియన్‌లో అన్ని అధికారాలు మడ్డి ఎల్లయ్య చేతుల్లోనే కేంద్రీకృతమై ఉన్నాయని, అధ్యక్షుడు సీతారామయ్య అండదండలతో ఆయన “నేనే రాజు, నేనే మంత్రి” అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. బ్రాంచ్ కార్యదర్శులు అధికారులను కలవకుండా అడ్డుకోవడం, తమ ద్వారా మాత్రమే మాట్లాడాలని చెప్పడం ప్రజాస్వామ్య వ్యవస్థకు విరుద్ధమని అన్నారు. అదే విధంగా యూనియన్ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి నిర్వహించే సమావేశాలకు తనను పిలవకపోవడం తనకు తీవ్ర మనస్తాపాన్ని కలిగించిందని తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ అనుబంధ సంస్థగా పేరుగాంచిన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్‌లో ఈ విధమైన నియంతృత్వ విధానం కొనసాగడం బాధాకరమని అన్నారు. యూనియన్‌కు సంబంధించిన లెక్కలు, పత్రాలు సభ్యులకు అందుబాటులో లేకపోవడం, తనకు తగిన గుర్తింపు ఇవ్వకపోవడం వంటి అంశాలను వ్యతిరేకిస్తూ డివిజన్ కార్యదర్శి పదవికి అలాగే యూనియన్ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు ఆరెల్లి పోశం తెలిపారు.

## గగ్గలపల్లిలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన...



నాగర్ కర్నూల్//**మార్చి 11 (ఆకాంక్ష) :** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే అనారోగ్యాలు దూరంగా ఉంటాయని గగ్గలపల్లి గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఎంఎల్‌హెచ్‌పీ ప్రీతి తెలిపారు. బుధవారం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వద్ద సిబ్బందితో కలిసి చెత్త చెదారాన్ని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం వనజ, ఆశ కార్యకర్త జ్యోతి మాట్లాడుతూ ప్రతిరోజూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి వ్యాధులను ముందస్తుగా అరికట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## అలరించిన పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం...



మంథని రూరల్//**మార్చి 11 (ఆకాంక్ష) :** మంథని మండలం గుంజపడుగు ఓజూష్ట్రం పాఠశాలలోబుధవారం పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు .ఈ సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, మంథని మండల విద్యాధికారి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు ప్రగతికి తొలి మెట్టు పదవ తరగతి పరీక్షలు కాబట్టి ఏకాగ్రతతో ఎలాంటి ఒత్తిడి లేకుండా ఈ పరీక్షలలో ప్రతిభ చాటాలని కోరారు. క్రమశిక్షణ విద్యార్థి జీవన విధానానికి దిక్సూచి పని చేస్తుందని క్రమశిక్షణ తోపాటు భవిష్యత్ లో మంచి విజయాలు సాధించాలని అన్నారు. వేంపాడు ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన కొండల్ రెడ్డి అనే ఉపాధ్యాయున్ని సన్మానించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి అతిథి లుగా ముత్తారం మండల విద్యాధికారి హరిప్రసాద్, గ్రామ ఉపసర్పంచ్ లక్ష్మి సదానందం ఉపాధ్యాయులు సురేష్, రవి, సంగీత, భూమయ్య, స్వామి, రవీందర్, నరేందర్, సతీష్ రెడ్డి, సమ్మయ్య ఇంకా విద్యార్థుల తల్లితండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గోదావరిఖనిలో 10వ తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు...



గోదావరిఖని//**మార్చి 11 (ఆకాంక్ష) :** పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని కృష్ణవేణి విద్యాసంస్థల ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. బుధవారం గోదావరిఖనిలోని బృందావన్ గార్డెన్‌లో “బోన్ వోయాజ్ డే” పేరుతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, కరస్పాండెంట్ మంజుల శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. వీరితో పాటు కృష్ణవేణి విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు రాజిరెడ్డి, ఎం.కె.టి.ఎస్. సత్యనారాయణ అడ్డగుంటపల్లి, సిరాజ్ బేగ్ (ఎన్టీపీసీ), శైలజ, అయాన్, అకాడమిక్ ప్రిన్సిపాల్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. మొదట దీపప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పదోతరగతి వీడ్కోలు సమావేశం విద్యార్థుల జీవితంలో ఎంతో ముఖ్యమైన ఘట్టమని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ పాఠశాల జీవితంలోని మధురస్మృతులను గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి లోనవుతారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులు తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించి ఆశీస్సులు పొందారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమం మొత్తం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది. విద్యార్థులు తమ పాఠశాల జీవితాన్ని గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. ఉపాధ్యాయులు వారికి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో ఇంద్ర మహిళా శక్తి క్యాంటిన్ ప్రారంభించిన ఎమ్మెల్యే ఎం.రాజ్ ఠాకూర్..



గోదావరిఖని//**మార్చి 11 (ఆకాంక్ష) :** పెద్దపల్లి జిల్లాలోని రామగుండం నియోజకవర్గ పరిధిలో గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో రోగులు మరియు వారి బంధువులకు తక్కువ ధరలో నాణ్యమైన ఆహారం అందించేందుకు ఏర్పాటు చేసిన ఇంద్ర మహిళా శక్తి క్యాంటిన్‌ను బుధవారం ఎమ్మెల్యే ఎం. రాజ్ ఠాకూర్ ఘనంగా ప్రారంభించారు. ఆసుపత్రికి వచ్చే పేద మరియు మధ్యతరగతి ప్రజలకు పరిశుభ్రమైన, తక్కువ ధరలో భోజనం అందించేందుకు ఈ క్యాంటిన్ ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఆసుపత్రి వద్ద ఆహారం కోసం ఇబ్బందులు పడుతున్న రోగుల బంధువులకు ఈ క్యాంటిన్ ద్వారా సౌకర్యం కలుగుతుందని తెలిపారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఈ ఇంద్ర మహిళా శక్తి క్యాంటిన్ మహిళల ఆర్థిక స్వావలంబనకు దోహదపడుతుందని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ తెలిపారు. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని, ప్రభుత్వం మహిళల సాధికారతకు ప్రాధాన్యత ఇస్తూ మహిళా సంఘాలను ప్రోత్సహిస్తోందని ఆయన వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులు మరియు వారి బంధువులకు అందుబాటు ధరల్లో నాణ్యమైన భోజనం అందించాలనే లక్ష్యంతో ఇంద్ర మహిళా శక్తి క్యాంటిన్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు సామాన్య ప్రజలకు ఉపయుక్తంగా మారాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆసుపత్రి అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.